# ఒక పొట్టివాడూ- కొందరు పొడవువాళ్ల కథ

చుక్కలు కనుచూపుదాటి- తూరుపు మూల పొడుస్తోన్న కాంతిలో కలిసి పోతున్నాయి. అడివిదాటి, కొండెక్కు తుంటాడేటో- చంద్రన్న? కొండయెక్కీ, మళ్లా అవతలకేసి కొండదిగి, పల్లాన ఒరిస్సా బస్సెక్కాలట! ఎంతేళకి సేర్తాడో....? ఈ అడివీ, కొండా దాటి అవతలకెళ్ళీ, ఆ బస్సెక్కీ బదులు- యివతల మన 'కొసాలస'కి బస్సు వొస్తంది గదా- అదెక్క గూడదా- అంటే.... 'నీకుతెల్దు' అన్నట్టు నవ్వి; తల అడ్డంగా వూపి; తొలి కోడికూత యేళకి లేపేసి- అడివిదాటీదాక కొరియర్ డూటీ - యేస్సాడు.

రాత్రంతా "కొసాలస" జనాలు చేసిన 'కిందిరి నృత్యం' చూసి, ఆనందంతో ఊసులాడుకొంటూ వెళ్తోన్న ఆకాశ కన్యల్లా- కొండశిఖరమ్మీంచి తెల్లటి మబ్బుల గుంపులు కదుల్తూ కన్పించేయి.

ఇంతవరకింకా యెక్కడుంటాడు- కొండదిగేసుంటాడు చెంద్రన్న!- అడవిలో వెనుదిరిగేడు - ట్టిపొ. అడవికీ, కొండకీ మధ్య వాగు- యేదో పాటపాడుకుంటూ పల్లానికి, ప్రవహిస్తోంది. వాగు, వొడ్డున వొక పనసచెట్టు- పల్లపు గ్రామంలో మర్చిపోయిన దేనినో గుర్తుదెచ్చుకోవ తల గోక్కుంటూ నిల్చుండిపోయిన- ఆదివాసీలా వుంది. పనసచెట్టు పక్కన - ట్టిపొ.

చంద్రన్న- వాగుదాటి కొండమీదకి వెళ్తున్నప్పట్నించీ, యేదో గుర్తుకురాక, తలగోక్కుంటున్నాడు ట్టిపొ. దురదకు పత్తెంగా వుంది- గోక్కుంటుంటే! యేవేవో గుర్తు కొస్తన్నాయి. వొక వొరసా, వాయీ లేదు....

".....ట్టిపో, మీ చెంద్రన్న వొచ్చారంట్రా? ఇదో, యీ గడ్డపెరుగిస్తా, పట్టుకపోయి, చెంద్రన్నకి పెట్టు. పాపం! ఏం తింటరో? యాడ పంటరో....? ఔన్రా... మీ చెంద్రన్నకి పెళ్లయ్యిందిరా? భార్యా, బిడ్డలెక్క డుంటార్రా? పాపం! చెంద్రన్న... మీ గెంజినీళ్లే తాగుతాడా? మీ గడపల్లోనే నిద్రోతాడా? చ్చొ..చ్చొ..చ్చొ...."

రెండ్రోజుల కిందట- కమ్మొదొర భార్య రుక్మిణమ్మ మాటలు గుర్తొచ్చేయి ట్టిపొకి.

చంద్రన్న మా గెంజీనీళు తాగి, మా గడపల నిద్రోతున్నందుకు - రుక్మిణమ్మేల అంత నొచ్చుకోవాల...? నాలిక్కరుసుకోవాల....? బుగ్గలు నొక్కుకోవాల....?

ఆమె నొచ్చుకున్నా, మెచ్చుకున్నా.... చూపుకి గొప్ప పిరుంగా వుంతాది. అనాది, మనాదోల్లు, యెవుళంత కరీదుగ కనిపించరు. రుక్మిణమ్మ- పేరుకి తగినట్టుంటాది. తులసి దళానికి తూగిపోతే తూగి పోవొచ్చుగాని, కిష్ణపరమాత్మడు- రుక్మిణీ కరీదు, మిగిలిన యే భామలుంతారు....? తూకం తక్కువ మనిసికాదురో- రుక్మిణమ్మ....!

చెంద్రన్న గురించేలడగతంది....? ఏల తూకఁవేస్తంది..?

కావడి బద్ద వెదుకుతోన్నట్టు, ఆవిడ్నించి తప్పుకు పోయినా- వొదల్దే...!

"...వొద్దులేరా. నువ్వింక నీళ్లు మోసుక రావద్దులేరా. ఇంటి పన్లూ, పెంట పన్లూ .... నువ్విక చెయ్యొద్దులేరా. పువ్వుల రాజియ్యని వాడుకోమన్నారయ్‌గారు. నీకీ పన్లేవీ చెప్పొద్దన్నారు. అయ్‌గారికి - నువ్వంటే గొప్ప అభిమానంరా..."

తీయబోతోన్న కావడిబద్దనలా వొదిలేసి, వాకిలి దిగి, పశులసాలవేపు నడవబోతే-

"...అయ్‌గార్లుగా- తెల్లగా, పొడుగ్గా, యెంత కళగా వుంటార్రా... చంద్రన్న!" రుక్మిణమ్మ, మెరిసే కళ్లతో అడిగింది ట్టిపొని.

ట్టిపొ... అనుమానంగా చూసాడామెను. అన్ని విధాలా అనుగుణ్యమయిన పోషణలో యెదిగిన ముప్ఫయ్యేళ్ల స్త్రీ... ఆమె! ఆమె కన్పించిందిగానీ, ఆమె అంతరంగం కన్పించలేదు, బోధపడలేదు.

ట్టిపొ.... రుక్మిణమ్మనూ, దొరనూ తేలిగ్గా తీసుకోడు. వారి ప్రతి మాటనీ, చర్యనీ, సందర్భాన్నీ- భూత, భవిష్యత్ కాలాల్లో గూడా పరీక్షకు పెట్టుకునిగానీ- నిర్ధారణకు రాడు. రుక్మిణమ్మా, దొర- యీ వలసకు - అటు క్రిష్ణాజిల్లా నిండొచ్చిన ఆదిలో - యీ పచ్చని అడవీ, కొండా, వలసల్లో, యీ మాయమార్మాల్లేని మనుషుల మధ్య, యిలాగ చల్లగా యేలోటూ లేకుండా జీవిస్తే చాల్ను అన్నట్టుండేవారు. నవ్వుతూ మాటాడేవారు. పేరు పెట్టి పలకరించేవారు. పనికి కూలి చెల్లించటంతో పాటూ- పచ్చడో, పండో, కాయో; పాతవే అయినా, ఖరీదయిన గుడ్డలో, యేవో యిచ్చేవారు.

"...యే - నియమ్మ రంకు మొగుడొచ్చి పన్లు సేస్తార్రా? వారంకి వారం... అంతా జబ్బొచ్చిందని ఉక్కులేస్సి తొంగొంటే- యే-నీ పెళ్లం రంకు మొగుడొచ్చి సేస్తార్రా యీ పన్లు....? వొద్దు. వొద్దొద్దరే వొద్దురా. నంజె కొడకా వొద్దు. నువ్వు నాకాడ కంబరికఁ వుండొద్దు. కక్కు. నా బాకీ కక్కు. కక్కేసి- తొంగో! పెల్లం పక్కన తొంగో...! ముందు నా బాకీ కక్కు.... కక్కురా నమ్మీకీ...! మాయ నమ్మీ కొడుకుల్రా మీరు....! చింతచెట్లు మాయజేసేస్తారు. సింతపండు సాటున అమ్మేస్తారు. అందికే కార్పొరేసన్నా కొడుకులు - మిమ్మల్ని నమ్మరు. ఆళ్లే తగును మీకు. మీ ఇళ్లళ్ల దూరి, సింతపండు, యిప్పపప్పు, వేప్పప్పు, కందులు గిందులు దోచీసి, గొదాంల పోసీసి, పొమ్మంతారు. మీరు మాయ

కొడుకులు కాబట్టే- ఫారెస్టు డిపాడ్మెంట్ నా కొడుకులు - అడివిలోని పుల్లకొక కేసుబెట్టి.... మీ ఒళ్లు నులుపు తీరుస్తారు. ఆళ్లే తగునురా మీకు. మీ ఎముకలిరగొట్టి పులుసొండిన పోలీసోళ్లే మీకు తగును? నాయుడు కర్నాలు తగును. పల్లపోడు తగును....! ఆళ్లే మొగుళ్లు.....! అలాగుంతేగాని- మీరు లొంగరు... నంజె కొడకల్లారా...."

వొక కంబార్ని దూషించాల్సినా, శిక్షించాల్సినా- మొత్తం ఆ కంబారి గిరిజన జాతినే దూషించేవారు, శిక్షించేవారు పాతతరం బుగతలు!

"....ఏఁవయ్యో, రాజెయ్యా. జొరఁవా? గోళే మింగినావా? వొద్దులే, పండుకో. తగ్గినంక- పన్లోకి వొస్తువుగాన్లే. అఁ... ఈ పిల్లగాడు, మీ పిల్లగాడా? పశులు కాయిటం, నీలుదేవటం చెయ్యగల్డా? చెయ్యగలడంటావా? సరే, అయితే.... పంపించు....! చేపిస్తా....! ఏంవంటవ్? కార్పొరేషనోళ్లా...? చింతపండు తీస్క పోయినారా? అడుగుతాలే. పట్నం మార్కెట్ రేటిమ్మంటలే. ఎవరూ.... ఫారెస్ట్ గార్డు....? చెప్తాలే. ఏదోమరి - వాళ్ల డూటీ వాళ్లదీ. ఫారెస్టోళ్లు, పోలీసోళ్లూ, రెవిన్యూ వోళ్లూ...... గవర్మెంటోళ్లు! ఆళ్లకి గౌరవమిచ్చి మసులుకుంటే- మనకి మంచిది. చూస్తాలే..... పండుకో! పన్లకేంలే... ఎల్లడప్పుడుంటయ్- ఎవరోవొకరు సేస్తరు. అయినా- అందికే, యంత్రాలని నమ్మినాగాని, నీళూ పాలూ, చిట్టూ, కుడితీ- మిషన్లు యివ్వవుగా....! పండుకో, పండుకో....! యిదిగో- చిల్లర మల్లర పనులకే - మనుషులుగావాల....! అవి, నువ్వే చెయ్యాలా? అక్కర్లే- పిల్లకాయలు సేయగఁలు..."

కంబారిని మనిషిగా, అతడ్ని అతడిగానే దూషణో, భూషణమో చేసి, సమూహం నించి విడదీసి మసిలే వారు కొత్తరకం బుగతలు- దొరలు!

పాతతరం బుగత- యెలా బుగతయ్యాడో, యేం తెచ్చాడో వలసకి తెలీదు- గానీ కొత్తతరం దొర బుగత- నోట్ల కట్టలూ, ట్రాక్టర్లూ, హైబ్రిడ్ విత్తనాలూ, ఎరువులూ, టీవీలూ, టేప్ రికార్డులూ- సిల్కు బట్టలూ, సింగారాల సరుకులూ, స్కూటర్లూ, మోటార్లూ, డబల్‌కాట్ బెడ్‌లూ, పరుపులూ, స్కీములూ, వాయిదాలు కొత్తకొత్త మాటలు..... తెచ్చేడు!

అతని మాటలు, చేతలు, సరుకులు.... బయటకి కన్పించిన రూపం వేరూ; వాటి సారం వేరూ....! దుక్కులుదున్నే, పంటలు రవాణాజేసే, రకరకాల సామూహిక శ్రమలను వొక్క చేసే- దొరగారి 'ట్రాక్టర్'ని చూస్తే, అది చలనంలోనున్నప్పటి దాని శబ్దమూ, కంపనమూ, దాని పని విధానమూ- మనిషికి శ్రమని తగ్గించే ఆ పరికరం పట్ల- యెంతో ప్రేమ, అభిమానం, కలుగుతుంది. గానీ వొక ఎద్దునో, దున్ననో, సహకరించే పశురాన్నో- అభిమానంగా గంగడోలు దువ్వి పరామర్శించినట్టు- ట్రాక్టర్ని పరామర్శించలేడు ట్టిపా. అంతేగాక, మనుషులకి శ్రమ తగ్గించిందేగానీ; కూలీలకి పనిలేకుండా చేసిందనీ తెలుసుకొని, అర్థంగాని, ఆ విజ్ఞాన పరికరం పట్ల అతి జాగరూకతతో వుంటాడు ట్టిపా. సరిగ్గా- దొరగారితోనూ, రుక్మిణమ్మతోనూ అంతే!

అంచేత, తనదయిన శైలిలో, రుక్మిణమ్మ వేపు చూస్తూ-

..... సిల్మాల్లో యిరో, యిలనూ వోకే హైటూ, వెయిటూ, కలర్తోటి వుంతారు. అలగైతేగాని- సిల్మా యిట్టవదుగదా! ఆడియన్సుకి - హైటూ, వెయిటూ కలరుకంటా- గుణం ముక్యం! గుడిసేటి గుణం యెవుడి కుంతాదో - ఆడు ఇలనే! మా సెంద్రన్నకి- ఆ గుణం లేదు..." అని బదులిచ్చి నడిచేడు.

".... అయితే, అయ్‌గారికున్నదా? ఆయన యిలనా? హమ్మమ్మ- యేం న్యాయింరా!" యింకేవో అనుకుంటూ రుక్మిణమ్మ వెంట రాబోతూంటే; టిపిపా పశులసాల దాటి, బయటికి వెళిపోయేడు....

పనస చెట్టు- తల విసురుకుందొక్కసారి. వాగు....యేదో గొణుక్కుంటూనే వుంది. టిపిపా.... తలగోక్కోవటం ఆపి, తల విదిలించేడొక్కసారి. గత రాత్రి సమావేశం గుర్తొచ్చిందీసారి.....

"....నేను- తిరిగొచ్చేసరికి- ఆలస్యం కావచ్చు. అంతవరకూ....." అంటూ ఆగేడు చంద్రన్న.

"...కూలిరేట్ల సంగతేటి? ఫారెస్ట్ తోటల మాటేటి? పాలేర్ల జీతబత్తేల ఊసేటి? దొరతోటి అరిటితోట తగువు పంచాయితీ యిషయమేటి? మెడికల్ కేంపన్నాం, మెమొరాండమన్నాం-" తమ ముందరి సమస్యలూ, కర్తవ్యాలూ గుర్తొచ్చి అడిగేడు గ్రామకమిటీ అధ్యక్షుడు ఆదెయ్య.

సేనారాత్రిదాకా సాగింది గ్రామకమిటీ సమావేశం. తక్షణ సమస్యలు, దీర్ఘకాల సమస్యలు- వాటి పరిష్కారాలకు సంబంధించి ఎత్తుగడలు, వ్యూహం!

చంద్రన్న చాలా విషయాలు వివరించేడు. చాలాసేపు మాట్లాడేడు. ఇవే విషయాలు, యివే మాటలు- బాలల సంగం కార్యదర్శియైన టిపిపా, ఒకనాటిరాత్రి సెంట్రీ కాస్తూ; అలనాడు విన్నవి గుర్తొచ్చేయి..... ముప్పయ్యేళ్ల మునుపు.....

"....కామ్రేడ్స్ యుద్ధం ఆరంభమై పోయింది. శత్రువు దాడికి దిగిపోయేడు. ఇక మనం ఆ దాడుల్ని తిప్పికొడితేగానీ- మన ఉద్యమం బతకదు. ఉద్యమాన్ని రక్షించుకోవాలీ, విస్తరించుకోవాలి. చట్టబద్ధ పద్ధతులిక చాలవు- చట్టధిక్కార పద్ధతుల్లోకి, బహిరంగ పని విధానం నుంచి రహస్య పని విధానంలోకి, సామూహిక ప్రతిఘటన నించి గెరిల్లా దాడుల్లోకి, సాంప్రదాయ ఆయుధాల్నించి సైనిక ఆయుధాలలోకి - విప్లవ సాయుధబాటలోకి... మళ్లాలి...."

గుడిసెలో, దీపం వెలుగులో, ఎన్నటికీ ఆరబోని వెలుగురేఖలా- గురువు.....! సరిగ్గా అవే మాటలే అన్నాడో... ఆ అర్థంలో అన్నాడో...? గురువు... చాలా సేపు మాట్లాడేడు.

టిపిపాకి- గురువుకి ప్రక్కగా వెళ్లి కూర్చోవాలనిపించింది. ఆయననూ, ఆయన అప్పటికే పట్టుకున్న తుపాకీని..... స్పర్శించాలనిపించింది. గురువు- బడిలో చదువు చెప్పినపుడు- తనని అరిక శుక్రూ అని పేరు పెట్టి, పిలిచి; ప్రక్కన కూచోబెట్టుకొని కతలూ,

పాటలూ, కబుర్లూ చెప్పేడు. అక్షరాల మహిమ చెప్పేవాడు. పొట్టివాడినని అందరూ తనని "ట్టిపా" అని వెక్కిరిస్తారంటే- వామనుడి కత చెప్పి, ఓదార్చేడు. గురువూ పొట్టివాడే..... గానీ.....

అక్షరాలొచ్చాయెూ,లేదో కతలు నేర్చాడో లేదో, బతుకు పాఠాలు బోధపడినాయో.... లేదో; పాఠశాలని దగ్ధం చేసారు పోలీసులు.

మంటల్లో, మాడి బూడిదైన పాఠశాల గురించి, చీకటి గుండెల్లో, యేడుపు కళ్లతో ఆ రోజు రాత్రి తండ్రిని ప్రశ్నిస్తే-

"...బడిసాల దొరికిపోనాది, తగలెట్టేసినారు! గురువులాగ- బడిసాల అగ్యాతంలోకి యెళిపోతే- ఆళ్ల వొశిమవునా తగలెట్టడం...." అని బదులిచ్చేడు తండ్రి!

అంతే! అప్పట్నించి అంతా అజ్ఞాతం!

ఆకాశంలో- నక్షత్రం అజ్ఞాతం.

అడవిలో ఆకు అజ్ఞాతం. నీటిలో చేప అజ్ఞాతం....

వెలుగురేఖలు- వాగు నీటిపై ప్రసరించి, పరావర్తనం చెందుతున్నాయి. ఒడ్డుమీది పనసచెట్టు మీది చిలుక- ట్టిపా తలమీదుగా అట్నించిటూ, యిట్నించటూ యెగుర్తూ. యేవో పలుకులు పలికింది. ఆ చిలుకను చూస్తూ ట్టిపా- శ్రీకాకుళంలో సీఁవకొండకీ ఏంపిల్డో యెల్దు మొస్తవా- సిలకలు కత్తులు దులపరిత్తయట- యేం పిలడో యెల్దుమొస్తవా- అని పాట ఎత్తుకున్నాడు. ఆ పాటను ఆరంభం నుంచీ, కొసదాకా వొక ఉద్వేగస్వరంతో పాడేడు. చిందులేస్తూ పాడేడు. ఆ చిలుక- టపటపా రెక్కలు కొట్టుకుంటూ, అక్కణ్ణించి దూరంగా యెగిరిపోయింది.

చిందులేస్తూ, ట్టిపా- ఔను, యీ పాట సిల్మాలోకి యెల్లింది గదూ? సిల్మాల్లో గూడా అన్నల భోగట్టాలన్నీ చూపిస్తున్నారు గదా? ఆ సిల్మావోళ్లకి- అన్నల గురించెలాగ తెలుస్తాది? అన్నలంతే- యెవరు? ఏ గ్రూపోలు...? అన్ని గ్రూపులోలూ- అన్నలే గదా మళ్లా? అవన్నీ సిల్మావోళికి యెలగ తెలుస్తాయి? ఏఁవీ తెలీనోడే- యేదాని గురించయినా - కతా, కయిత్వం అల్లీగలడనీ, సిల్మా తీసీగలడనీ- రమేశన్న అనీవోడు...! ఔనూ? రమేశన్న యేట యినాడు? ఉద్యమాన్నొదిలేసి, ఊరెళి పోండు. పోలీసోడొదల్దుగడేటి? కేసులూ, వాయిదాలుండవేటి? ఏటయినాడు....? ఏటిలగ... అన్నీ ప్రెశ్నిలే!

పెడతల గోక్కున్నాడు అసహనంగా వుంది. నేలని అరిపాదం కొసతో- ఊడ్చి తన్నేడు. గబాల్న పనసచెట్టు దగ్గరికి నడిచి- రెండు చేతుల్తో దాన్ని బలంగా ఊపసాగేడు. ప్రశ్నలు, ప్రశ్నలు, ప్రశ్నలైతే.... ట్టిపా సహించలేడు.

ఓసారిలాగే-పోలీసులు ప్రశ్నించినపుడు.

"....మీ అయ్యేడిరా? గురవొస్తండా? కాగ్రేమేలొస్తగ్రనా? మీ అమ్మ యెక్కడకెళ్లిందిరా? అయ్యదగ్గిరికా? గురువు దగ్గిరికా?" యింటి గడపలో మంచమ్మీద కూచొని, ట్టిపాని యెదురుగా నిల్చోబెట్టుకుని పోలీసులు ప్రశ్నించసాగేరు.

చాలా సేపు సహించేడు చాలా ప్రశ్నలకు తలను అడ్డంగా, నిలువుగా ఊపి సమాధానాలు చెప్పేడు. గానీ, యీ ఆఖరి ప్రశ్నలకు - వాడు సహనం కోల్పోయేడు. నోరు విప్పి; కీచుగొంతుతో-

"...యేల అలగ ప్రెశ్న మీద ప్రెశ్న యేసి సంపుతారు? ఎందుకు? ఏఁవీ? నీనేటి మిమ్మల్ని- మీ అయ్యేలెగ్రా అనడిగినానా? మీ గురువులూ, నేస్తాలూ, యెక్కడ్రా అనడిగినానా? మీ తల్లులు- యెన్నంట తిరుగుతగ్రను... అనన్నానా? మరి నన్నెందు కడుగుతారు...?" అని ప్రశ్నించేడు.

ఆ పోలీసులు క్షణకాలం అవాక్కయి పోయేరు. ఆ తర్వాత తేరుకొని తమ ప్రతాపం చూపించబోయేరు' అంతలో- చిందువ వొకటి వెంట దగుల్తుంటే పెద్దగా అరుచుకుంటూ, కకావికలై మేకలూ, గొర్రెలూ, పశువులూ వలసలోకి పరుగెత్తుకొచ్చేయి. వలస జనాలు - వేటబల్లేలూ, కర్రలూ పట్టుకొని, ఈళలువేస్తూ, డప్పులు గొడ్తూ, చిందువను తరుమటానికి కదిలేరు. పోలీసులు..... భయంతో కకావికలై పారి పోయేరు.....

పనసచెట్టు.... జలజలా మంచు బిందువుల్ని రాల్చింది. ట్టిపా చెట్టుని వొదిలేసి, ఊరివేపు నడవసాగేడు. చంద్రన్న యెంతవరదాకా యెళ్లుంటాడు? తిరిగెపు డొస్తాడు? రుక్మిణమ్మ- చంద్రన్నని తూక మేస్తందెందుకు?

తరగని జ్ఞాపకాలూ, ఆలోచనలూ, ప్రశ్నలతో ట్టిపా- ఊరి ముందరి సంతతోటకి చేరేడు. సంతతోటకి ఆనించిన అవతలవేపు రోడ్డు మీంచి - బస్సు రివర్సయి పట్నం వేపు మొహాన్ని పెట్టి- బయల్దేరబోతోంది.

"....వొరే, ట్టిపా, అది ఉప్పలూరి రాజు గారి బస్సేనేట్రా?" అని అడిగేడు. దోవకి కాస్త ప్రక్కగా, డొంక చాటున మలవిసర్జనకు కూర్చున్న ఆదెయ్య, లేచినిల్చొని.

ట్టిపా- వోసారి రోడ్డువేపూ, మరోసారి ఆదెయ్యవేపూ చూసి-

"...యేఁవీ? డొంకసాటున అన్లోడ్ చేసిందాన్ని- ఆ బస్సుకి లోడింగ్ గాని సేస్తావేటి?" అని హాస్యమాడేడు.

"...యిగటాలు తరాత ఆడుదువ్‌గానీ; ఆ బస్సుని కేకలేసి ఆపురా..." అని చెప్పేడు ఆదెయ్య.

ట్టిపా- నిల్చున్న చోటనే గంతులేస్తూ; నోటికి యిరువేపులా అరచేతులు రెండిట్నీ పరచి - "ఆపాలాపాలోయ్-" అనరిచేడు.

రాజుగారి బస్ హారన్ మోతలో- ట్టిపా కేకలు మునిగిపోయేయి. బస్సు వెళ్ళి పోసాగింది. అయినా ట్టిపా, అలాగే గెంతు లేస్తూ-

"...సంగం పెసిరెంటు వొస్తాడ్రో- అపాలాపాలోయ్..." కేకలేస్తూనే వున్నాడు. అదెయ్య, కడుక్కొని, లేచి, డొంక నుంచి బయట దోవలో కొచ్చి, ట్టిపా భుజమ్మీద చరుపు చరిచి-

".... వొయిసు పెరిగినా మనిషివి పెరగనట్టుగా, బుద్దీ పెరగలేదుర నీకు! యెట కారాలకి తప్పా, ఉపకారాలకి పనికి రావురా...." అని దులిపేడు.

"...వోసే! యింకేటి సేసేది? అరిగోసు బెట్నాను. సంగం పెసిరెంటుర్రో అనిగూడ అరిసేను. ఆ బస్సుకంత నిసాకార(వా? పెసిరెంటు వొస్తండర్రో... అని సెప్నంతే యెళ్ళిపోద్దా? యెల్లనెల్లనీ..! ఏదో వొకనాడు- మందుపాతర క(విరిపోదా.... మా పెసిరెంటు వుసురు తగిలి..." అని శాపనార్థాలెట్టేడు ట్టిపా.

అదెయ్య అనుమానంగా చూస్తూ, ఊరిలోకి నడిచేరు.

".... పెసిరెంటో, పెసిరోంటో.... కా(్రే, కా(్రే.... ఉప్పలూరి రాజుగోరి బస్సుని యేల ఆపమన్నావు?" అనడిగేడు ట్టిపా.

అదెయ్య-

"...సాలూరు దుర్గా టాకీసుల మోర్నింగుషో యేటేస్తన్నారో కనుక్కుందు (వనీ..." అని చెప్పి, తన యింటి వేపు నడిచేడు.

అప్పుడు గుర్తొచ్చింది ట్టిపాకి- సాలూరు మేజిస్ట్రేటే కోర్టులో 'జన్ని పాలం కేసు "వాయిదా అని! సంగం సభ్యులు - ముప్పయి మంది దాకా ముద్దాయిలు. అందరూ హాజరవ్వాల!

హన్నన్నా.... పెసిరెంటు యేదీ తిన్నగా చెప్పడు. అన్నీటికీ మర్మమే! పెద్దపెద్దల్తోటి, ఆపీసర్లతోటి, పోలీసుల్తోటి, బుగతల్తోటి, దొరల్తోటి - పోని, అన్నల్తోటి... నువ్వు అలాగే, అడ్డుసుడిగా మాటాడు. కోడలికి తగిలేట్టు కోడిపిల్లని తిట్టే అత్తదానిలాటి సెమత్కారాలన్నీ... అల్లకాడ సెల్లించుకో. అంతేగాని; నీనెవుడ్ని. నీలాగే, నీ వొలసల పుట్టి పెరిగినోడ్ని. నీ మొకం, నా మొకం - దొరగారి యింట్లోని టీవీల వార్తలూ, ఎడ్వటీజ్మెంట్లూ యినిపించీ మొహల్లాగ వొద్దనుకున్నా- యెదరవుతాయి. నీ గుణం నాకూ, నా గుణం నీకు తెలవ్వా? పసుపు సొక్కాకి గాందీటోపి సంగతెల్దా? గాంధీ టోపికీ- పసుపు సొక్కా సంగతెల్దా? అయితే ఆటిలాటోళిం కా(వు మనం అనుకో! ఉప్మానానాకి సెప్పేను. మరంచేత, నా దగ్గిటగూడ యేసకాలేనా?

- వొరే, వొరే ట్టిపా- వోయిదారా యీ రోజు. ఆ ఉప్పలూరి రాజుగోరి బస్సు రొండోట్రిప్పుకి- మనోళ్ళందర్నీ రడీ సెయ్యిరా అనంతే- యేటి నీ సె(వత్కారం సెల్లెక్కి పోద్ది? ఎంతకి నువు- కయిగట్టి పాటలవీ అల్లినోడివే అయితే మట్టుకు అన్నీటికీ కయి గట్టిస్తావా? ఎవ్వారం దగ్గరా కయితలేనా? సె(వత్కార(వేనా? అలాగేనివే! మన రాజ్జి(వొస్తే- సెంద్రన్నకి సెప్పి పనీపాటు లేకుండా- సె(వత్కారాలూ, కయితలూ కట్టీ శాఖనొకటెట్టి- దానికి మంత్రివి అయి పోదువులే. అలగేనివే!

తిరిగి, నాదట యెటకారం...! వొద్దుద్దు... నాతోటెట్టుకోవద్దు. నీనూ నీలాటి తిరకాసులోడినే. నువ్వు నడిసే మట్టి మీద నడిసినోడ్నే. నువ్వు పీల్చినగాలి పీల్చినోడ్నే. నువ్వెళ్లిన వోయిదాలకి నీనూ యెళ్నాను. నువ్వు తిన్న జెయిలు కూడు నీనూ తిన్నాను. నువ్వు కాసిన లాఠీ దెబ్బలు, బూటు తన్నులు- నీనూ కాసేను. నీ సంగం, నా సంగం వొకటే. అయితే నువ్వు పెసిరెంటుని, నీను మెంబర్ని, గానొకటి- నీలాగ నాకు అజీర్తి లేదు. గోవొర్జినం అసల్లేదు....అం.....

అని పరిపరివిధాల పెసిరెంటుని నిరసించసాగేడు ట్టిపా. మనసుదీరా అలా లోపల పెసిరెంటుని హీనపరిచి తృప్తి చెందేక - దోవవేపు చూస్తూ నడిచేడు. ఆదెయ్య అప్పటికి తన వీధి మలుపు తిరగబోతున్నాడు. అప్పుడు మళ్లీ ట్టిపా, పరుగెత్తుకు వెళ్లీ, ఆదెయ్యని కలిసి-

"... పెసిరెంటో, యెక్కడెక్కడో దూర దూరంగా సిటీల్లంట మీటింగులకైతే- మనోళ్లందరిఁవీ బయిలెల్తాం, ఫ్రీగా రెయిల్లెక్కేస్తాం- చలో అనేస్తాం. గాని; యిదిగిలగ పార్వతీపురం, సాలూరు, యిజీనగరం- కోర్టులుకీ, ఆఫీసులకీ - యెళ్లాలనీ సరికి- సిక్కొస్తంది. ఫ్రీగా యెక్కేసి - చలో అన్లేం. మరిలగ తిరగాలంతే- వుండొద్దేటి మనకాడ కాసులు? వొకసారా? రొండుసార్లు...? ఎన్ని సార్లు తిరుగుతాం? ఎక్కడ తెస్తాం కాసులు...?" అని నసిగేడు.

"...సంగం ఆఫీసు వొరండా మూలకి మర్రిచెట్టు లేదా? కాసులు కాస్తందట! వోయిదా, వోయిదాకీ దులుపుకోమని సెప్పేడు చెంద్రన్న....." బదులిచ్చేడు ఆదెయ్య.

అదా! ఆ తిపారఁవే, వొద్దంతాను- నీ సేఁవత్కారానికొక దండంరా నాయినా, నీ కయి గట్టడంకి పుంజిడు దండాలురా- అని కడుపులోపల ఉడుక్కుంటూ, కళ్లల్లో అమాయకత్వం ప్రదర్శిస్తూ-

"పోన్లే. ఏటి సేస్తాం. పెసిరెంటునే, పెద్దోడివీ, ప్రెథమ ముద్దాయిని- నువ్వు యెలగెల్తే- నీ యెనకాల మిగిల్నోలిమీ అలగే యెల్తాం..." అని బదులిచ్చి, వెనుదిరిగేడు ట్టిపా.

అప్పుడు ఆదెయ్య-

"రాజుగోరి బస్సు రొండో టిప్పుకి రడీగుండండి- అందర్నీ యెక్కించుకెల్తాను.," అనన్నాడు.

★★★

మేజిస్ట్రేట్ కోర్ట్!

ఉదయం పదిన్నర గంటల వేళ!

నల్ల, నల్లని కోట్లూ, తెల్లతెల్లని పంచే, లాల్చీలూ, కాకులూ, గ్రద్దలూ, కాఫీలూ, టీలూ, కవిలికట్టలూ, నోట్ల కట్టలూ, అబద్దాలూ, నిజాలూ, సంకెళ్లూ, బూట్లూ, కాకీలూ, జీపులూ- "కక్షిదారులూ, ముద్దాయిలూ, పోలీసువారూ...." ఊళలూ...!

33

మేజిస్ట్రేట్ కోర్ట్...! మార్కెట్‌లా వుంది తప్పా, న్యాయస్థానంలా లేదు.

కోర్టు వసారాలో - వో మర్రిచెట్టు నీడ కింద, పాతిక మందినీ కూచోబెట్టి,

"....వోయిదా అయిపోగానే, మీరందరూ తిరిగి ఊరెళిపోండి. ఛార్జీ డబ్బులు ట్టిపా గాడికిస్తాను. నేను పారతీపురం యెల్లి- పీ.వో. (ఐటిడిఏ- పి.ఓ.) గోరిని కలుస్తాను. ఎల్లుండి-ధర్నా గదా. నోటీసిచ్చేసొస్తాను...." చెప్పేడు, సంగం ప్రెసిడెంటు ఆదెయ్య.

"... పెళ్లికి కారుడిచ్చినట్టగ, దర్నాకి నోటీసివ్వాలన్నమాట. ఓహో! అదొక రూలుసన్నమాట. రూల్సు పెకారం- ప్రెబుత్వం వోరూ, ప్రెజలూ నడుచుకోవాలన్నమాట. ఓహో..." తనకుతాను బోధపరచుకుంటూ, ధృవపరచుకోవడానికి ప్రక్కనే కూచున్న ట్టిపా వేపు- యేటంటావన్నట్టు చూసేడు నిమ్మక రూల్సు.

నిమ్మకోడు- నిజంగా తనకుతాను విషయాలను బోధపరుచుకోవటానికే అలా ప్రశ్నించుకుంటూ, సమాధానంగా - ఓహో- అని అనుకుంటాడో, లేక, ఆ విషయాల లోని అసంగతాన్ని అలా వెటకరిస్తాడో- అనుమానవే ట్టిపాకి.

గతంలో ఓసారి- సబ్‌జైల్లో తెచ్చి పడేసారు, యీ పాతికమందినీ. సారాకేసు! అంటే- సారా వండి, అమ్ముతూ దొరికిన కేసురాదు. సారా వ్యతిరేక పోరాటం- అంతటా జరిగినట్టే- యిక్కడా సంగం ఆధ్వర్యంలో జరిపేరు. "సారా కాదు- తాగు నీరు కావాల' ' "బ్రాందీషాపులు కాదు- రేషన్ షాపులు కావాలి", నినదించేరు. ఊరేగింపు తీసేరు. ఊరేగింపుగా వొచ్చి, బస్సులాగే జంక్షన్‌లో సారా షాపు కెదురుగా - వొక టెంట్ వేసుకొని- పాటలూ, ఉపన్యాసాలూ.... నినాదాలు...! ఒక గంట గడిచేసరికి- యిదే సాలూరు నుండి సర్కిల్ ఇన్స్పెక్టరూ, సబ్ ఇన్స్పెక్టరూ, నలుగురు కానిస్టేబుల్లూ... దిగేరు. లాఠీలూ, బూట్లూ, తోపులాటలూ, అరెస్టులూ జరిగేయి. తీసుకొచ్చి సబ్‌జైలులో పడేసారు.

అప్పుడు, జైలరు- యీ జైలులో మీరుగానీ, మీముగానీ రూల్సు ప్రకారము నడచుకొనవలెను. రూల్సు తప్పి నడవరాదు. అట్లయిన శిక్షలకు పాత్రులగుదురు- అని ప్రకటించేడు.

అప్పుడు- యీ నిమ్మకోడు ఆ ప్రకటన విని-

"....ఓహో... రూలుసన్నమాట! అదన్న మాట. రూల్సు తప్పగూడదన్నమాట. ఓహో... రూల్సు ప్రకారం సారానే - నీరు అనుకొని తాగాలన్నమాట. బేందీషాపునే- రేషను షాపు అనుకోవాలన్నమాట. ఓహో! అలాగ్గానే మీవు నడుచుకునుంతే- పోలీసులు అరెస్టుచేసి, యీ జెయిలుకి తెచ్చి పడీసుండకపోదురన్నమాట! ఓహో! ఆ పోలీసులు రూలుసు ప్రకారం నడుచుకున్నారు. ఇక్కడ జెయిల్ల - మీరు రూల్సు ప్రకారం నడుస్తారు. మీంవూ అలాగ నడుచుకోవాలన్న మాట! ఓహో..... లేకపోతే శికాకులన్నమాట! హన్నా..... రూలుసంతే....సిన్నా సితకా బోగట్టాలు కావన్న మాట పోన్లెండి. అలగలగే. యిప్పుడికేనా-

యీ జెయిల్లోనయినా- మీరూ, మీమూ రూలుసు ప్రకారం నడుసుకుందుం! రూలసు అంతేటి... సిన్నా, సితక మాట్లేటి? మీ జైలుకంటా, మీ లాఠీల కంటా, మీ ఊనిఫారాలకంటా, మీ టోపీలకంటా- గొప్పవి! అలాగే, రూలును పెకారం నడుసుకుందుఁవండీ..." అని సమ్మతి ప్రకటించేడు.

ఆ జెయిలరు- నిమ్మకోడి అమాయకత్వానికి అంగీకార ప్రకటనకీ ఆనందంతో పొంగిపోయి - తనచేతిలోని లాఠీ కర్రని - నిమ్మకోడి కళ్ల ముందరే విరిచి పారేసాడు.

ఆనాటి నుంచీ నిమ్మకోడు- రూల్సోడు అన్న పేరు పొందేడు.

ట్టిపాకి- అదంతా గుర్తుకొచ్చి, నవ్వుకున్నాడు. ఆ తర్వాత-

"వొరే రూల్సూ, రూల్సు పెకారం మనం పెళ్లికార్డూ యిస్తాం. రూల్సు పెకారం అళ్లు మనకి పెళ్లీ చేసెస్తారు. ఏదోవొకనాడు, రూల్సు పెకారం - నిన్ను యే పోలీసోడో ఎన్‌కౌంటర్ సేసేస్తేగానీ- మాకీ రూల్సు బాధ పోదు..." అని విసుక్కున్నాడు.

"అలగేనివే. పోలీసోడు, పోలీసు రూలుసు పెకారం ఎన్‌కౌంటరు జేస్తే; మనం మన సోదరులు రూలుసు పెకారం మందు పాతర పేలుస్తాం. అదన్న రూలుసు." అని బదులు యిచ్చేడు రూల్సుగాడు.

ట్టిపాకి- వొక్కసారిగా చాలా ఆశ్చర్యం కలిగింది! - హమ్మ నిమ్మకోడా! రూలుసోడా! నువ్వు చిన్నింటోడివి కావురో- అనుకొని, వాడిని మరింత ఉడికించటానికి-

"....మందుపాతరంటే... తిప్పతీగా, అడ్డసార ఆకూ, కలబంద దుంపా, గుగ్గిలఁవూ, గోమూత్రమూ కలిపి, మందుజేసి- దాన్ని పాతర యేస్తారు, అదేన్రా...?" అనడిగేడు.

రూల్సోడు- వొక్కక్షణం ట్టిపాని కిందా, మీదా చూసి, దగ్గరగా జరిగి, యెవరూ చూడకుండా, వాడి తొడమీద సొంటిపిక్క నొక్కి- యిదీ కలుపుతాం మందు పాతరల - అన్నాడు.

ట్టిపాకి- ప్రాణాలు తోడేసాయి! ఓరి, రూలు నంజి కొడుకో- సంపీసేవురో- అనరిచేడు బాధతో.

ఆ అరుపుకి - అక్కడి పాతికమందీ, ఆ కోర్టు వసారాలోని మరికొంతమంది యిటువేపు చూసేరు. అంతలో కోర్టు బంట్రోతు- ఆరిక ఆదెయ్యా వగయిరాలూ- అని మూడుసార్లు ఊళవేసాడు.

అరిక ఆదెయ్య- రండ్రరా రండ్రండి- అని పాతికమందితో కోర్టు హాలులోకి నడిచేడు. అందరికీ వెనకగా కోర్టు హాలులోకి ప్రవేశించేడు ట్టిపా..! తొడ సలుపు పెడ్తుంటే పళ్ల బిగువును ఓర్చుకుంటూ, రెండు చేతులూ యెత్తి జోడించి- నమస్కరించేడు మేజిస్ట్రేట్‌కి.

మేజిస్ట్రేట్ ఆశ్చర్యంగా చూసేడు - ట్టిపా వేపు. ట్టిపా- మళ్లీ చేతులు జోడించేడు. మేజిస్ట్రేట్ అనుమానంగా, ఉక్రోషంగా చూసి; బెంచి గుమాస్తాతో - దరిద్రుల్ని లంచ్‌బ్రేక్ తర్వాత మళ్లీ పిల్చి వాయిదా చెప్తాను, అంతవరకు వరండాలో వుండమను అని గొణిగాడూ అనువదించేడు.

ఉస్సురంటూ అందరూ మళ్లీ మర్రిచెట్టు నీడలోకి చేరుకున్నారు. ఆరిక ఆదెయ్యకు యేం చేయటమో పాలు బోవటంలేదు. చిరాకేసింది. దీనికంతటికీ కారణం-ట్టిపా గాడన్న కోపంతో-

"....భూఁవికి మూడు మూరలుండవు గానీ, భూమీ, ఆకాశాలూ పట్టవురా నీ సోత్రానికి..." అని తిట్లు యెత్తుకున్నాడు.

"...యేఁవీ నీనేటి సేసాను?..." ప్రశ్నించేడు ట్టిపా.

".... మేజిస్ట్రేటుకి- దండంవెట్టావెందుకురా, చేతులు జోడించి...?" అనడిగేడు ఆదెయ్య.

కిసుక్కున నవ్వేడు ట్టిపా.

వాయిదాకి వచ్చినపుడు-కోర్టుహాలులోకి ప్రవేశించిన ముద్దాయిలు-మేజిస్ట్రేట్‌గారికి నమస్కరించటం రివాజు. వకీళ్లు- యెలాగూ వంగి, వంగి నమస్కారాలు సమర్పిస్తారు. గానీ; యీ పాతికమందీ-అసలు నమస్కరించరు.

ఆఫీసులూ, కోర్టులూ, జైళ్లూ-తమవి గానటువంటి పరాయి వ్యవస్థలనీ, వాటి ప్రతినిధులు తమకి మేలు కంటే కీడే చేస్తారనీ; కాకిగూటిలోంచి పెరిగి, పెద్దదయి కోకిల బయటకొస్తుందేమోగానీ; యీ వ్యవస్థల వల్మీకంలోంచి విషనాగులు తప్పా-మరేవీ రావని-వారు అనుభవం లోంచి నేర్చుకున్నారు. నాగుపాములకి నమస్కరించినా కాటేస్తాయని వారి అభిప్రాయం! కాటేసేవాటికి నమస్కార ఖర్చెందుకని-నమస్కరించరు!

వీరిని కొన్ని వాయిదాలు గమనించి, గమనించి, గత వాయిదా నాడు మాత్రం మేజిస్ట్రేట్‌గారు-

"....మీరు అజ్ఞానులో, అహంకారులో నాకు అర్థమయి చావలేదు. అర్థనగ్నంగా వస్తారు. అగౌరవ చిహ్నాల్లా నిల్చుంటారు. ఇదొక న్యాయస్థానమని అనుకోరు. ఇక్కడొక న్యాయమూర్తనే బడుద్దాయి-వుండి చచ్చేడని చూడరు. ఆ బడుద్దాయిని గౌరవించాలని అనుకోరు. బండరాయి అనుకుంటారు. నేను బడుద్దాయినా? బండరాయినా? నేనెవర్ని? నన్నెందుకు గౌరవించరు? ఎందుకు? ఎందుకు?" అని, అణచుకోలేక, ఆక్రోశించేరు. ఆ తర్వాత- యీ రోజుకి వాయిదా వేస్నారు.

పాతికమంది గూడా-యీసారి వాయిదాకి వొచ్చినపుడు-నమస్కారాలెట్టెద్దామర్రా, పాపం-అని తీర్మానించు కున్నారు ముందు. కానీ, కాసేపయ్యాక -ఇన్నినాళ్లూ నమస్కరించని మనం, యీసారి నమస్కరిస్తే ఆయనకే నామోషీ! నేనడిగేను గనకా-మొక్కుబడిగా నమస్కరించేరనుకుంటాడు, నెమ్మది నెమ్మదిగా, మరికొన్ని వాయిదాల తర్వాత నమస్కరిద్దాం...అని తీర్మానాన్ని సవరించుకున్నారు. అప్పుడు రూల్సోడు-

"ఆయన న్యాయమూర్తి, మనం ముద్దాయిలం. కేసులో, నిజానిజాలూ సాక్ష్యాధారాల బట్టీ తీరుపు చెప్తాడు. అంతేగానీ నమస్కారాలు యెట్టేరని వాకలా, యెట్టలేదని మరొకలాగా తీర్పు యివ్వగలడేటి? అది రూలుసు కాదు గదా! రూలుసు ప్రెకారం అతగాను నడుసుకోవాల గదా? మరలాంటపుడు-నఁవస్కారాలు దండుగ గదా. నమస్కారాల దోవ నమస్కారాలది, రూలుసు దోవ రూల్సుది, తీర్పు దోవ తీర్పుదీ అవుతాయి గదా" అని, అనేక గదలు సంధించి, సవరించిన తీర్మానాన్ని రద్దు జేయించేడు...రూల్సుగాడు.

పాతపద్ధతుల్లోనే పోదామనుకున్నారు. ఇప్పటిదాకా వాయిదాల కొచ్చినపుడు-యెలా ప్రవర్తించామో, యికముందూ, అలాగే ప్రవర్తిద్దాం అనుకున్నారంతా. అందరూ, అలాగే ప్రవర్తించేరు-యీ వాయిదాకి!

అంతవరకూ ఫరవాలేదు. వీళ్ల పద్ధతే అది. వీళ్లు మాటల్తో మారిపోతారా? మారరు -అని సరిపుచ్చుకునేవారు మేజిస్ట్రేట్ గారు! గానీ, ట్టిపోగాడు నమస్కరించేడు. భూమికి మూడడుగుల మనిషి, జానెడు చేతుల్తో-ఓయీ బడుద్ధాయీ, బండరాయీ-యిదిగో నువ్వు అర్థించేవుగాబట్టి, పోనీలే, యేం ఖర్చయిపోతాది చేతులోసారి జోడించటఁవే గదా-అని, నేను గాబట్టి నమస్క రించేను అన్నట్టుగా కన్పించేడు మేజిస్ట్రేట్ గారికి!

ఆయనకు మండిపోయింది. సాధ్యమయినన్ని చిక్కులూ, చీకాకులూ, తీర్పులో గూడా శిక్షవేపే వెదకటాలూ- తీర్పు వేగం తేల్చకుండా-దగ్గర దగ్గర వాయిదా వేయటం, వాయిదాకి యెవడు రాకపోయినా -బెయిల్ రద్దుజేస్సి, వారెంటిప్పించి రిమాండ్‌కి తోలటం, వాడొకవేళ రీకాల్ పిటీషన్ పెట్టుకున్నా యాక్సెప్ట చెయ్యకపోవటం-వగైరా, వగైరా న్యాయశాస్త్రపరమైన-యెనెన్ని పుర్రాకులు పెట్టవచ్చో, అన్నన్నీ-యీ పాతికమందికీ పెట్టాలని నిశ్చయించుకొని; ప్రస్తుతానికి, యీ రోజుకి-మళ్లీ పిలుస్తానని-లంచ్ బ్రేక్ తర్వాత వరకూ-చచ్చినట్టు వుండమన్నాడు.

సంగం ప్రెసిడెంట్ ఆదెయ్యకు-అర్థఁవయిపోయింది. ఆదెయ్య పోలీసు అధికార్లతోనూ, రెవిన్యూ అధికార్లతోనూ, యింకా యింకా యెందరో అధికార్లతోనూ అనేక సందర్భాల్లో సంభాషించే, వార్ని గమనించే, వారి రూపాలేగాక అంత రంగాలనే వూహించుకు ధృవపర్చుకునే అనుభవాలున్నాయి. అంచేత, ట్టిపోగాడ్ని కోపందీరా తిట్టి, తిట్టి విసిగిపోయి.

"....పీవోగారిని కలాల! ఎలాగమరి...? ఈ మేస్రేటు నంజికొడుకు మళ్లా పిలిసి, వోయిదా సెప్పేసరికి సాయింత్రమైపోదా? ఎలాగ?" అని గింజుకున్నాడు.

అప్పుడు ట్టిపో, వినయంగా ఆదెయ్యతో-

"....సెల్లుకి ఫోనుజేసి సెప్పే గూడదేటి? పీవోగారు, పీవోగారూ-నేనండీ, ఆరిక ఆదెయ్యని. అఁఁఅఁ....సంగేరు వొలస సంగం పెసిరెంటుని. విదిగిలాగ జరిగింది. సాలూరు మేస్రీటు కోర్టులున్నాను. తిపారం మేస్రీటుగోడు వోయిదా యెయ్యడూ,

వొదలడూ! మజ్జేనం మళ్లా పిలుస్తానని వుంచేసినాడు. తిపారం నంజికొడుకు వోయిదా యేసీస్తే-అప్పుడు తిన్నగా పార్తుపురం పారొస్తాను. తఁవరు సిల్మాలకీ, సికార్లకీ యెళిపోకండి మా(పైబో. ఇంట్లీనో, ఆపీసులోనో వుండండి. పెళ్లికారుడు... ఛధా....దర్నా నోటీసు యివ్వాల తఁవరికి... అని చెప్పీగూడదా! ఏలలాగ గింజుకుంతావు...." అని సలహా యిచ్చేడు.

ఆదెయ్య-అనుమానంగా చూసేడు.

"....యెందుకలగ అనుమానిస్తావు? అన్నీటికీ మమ్మల్ని అనుమానించటమేనా? అనుమాన పుట్టలోడివి-మాకు పెసిరెంటెలగయిపోనావో! మా సంగం లెందుకున్నావో...! ఆ దొరగోరిల వేపు వుండాల్సి నోడివి! ఆళ్లలగేలే-అడుగుతీసి అడుగేస్తే అనుమానిస్తారు! అని నిష్ఠూరమాడేడు ట్టిపా.

ఆదెయ్య-మొహం ముడుచుకున్నాడు. ఆ మొహాన్ని ఆనందంగా చూసి,

"నువ్వేసెప్పావు గదేట-పీవోగోరు సేనా మంచోరు. సెల్లు నెంబరిచ్చేరు. ఏయేళప్పుడు, యే అవుసరిమొచ్చినా-సెల్లుకి ఫోనుజెయ్యిమన్నారని-యెన్నిసార్లు సెప్పలేదు నువ్వు? మరిపుడు-సెల్లుకి ఫోను సెయ్యి. యిదిగిలగయిందని సెప్పు తప్పేటి?" అని ట్టిపా మరింతగా, ఆదెయ్యను సంశయంలో పడేసాడు. ఆదెయ్య, మొహంలో యింకా మార్పు రాలేదు. అలాగే వున్నాడు. అంతలో-

"....ఇంతకీ యేల ధర్నా? యేం డిమేండ్లు? ఎంతఁవందిమెల్తాం? ఎలాగ యెల్తాము? ధర్నాకి-మనమేనా, లీడర్లెవుళేనా వొస్తారా?" ప్రశ్న మీద ప్రశ్న వేసాడు పత్తిక నీలడు.

మొన్న రాత్రి చంద్రన్న గ్రామసభ జరిపినపుడు-నీలడు లేడు. ఒరిస్సాలోని యేదో వలసలో నీలడి అత్తవారిల్లుంది! కట్టెలు గొట్టి, దిగువ గ్రామాల్లో, బస్తీల్లో అమ్ముకొని బ్రతుకుతారు నీలడి అత్తవారూ, ఆ వలస వారూ. అపుడపుడూ-పోలీసులతోనూ, ఫారెస్టోళ్లతోనూ-గొడవలే. ఒకసారెపుడో, పోలీసులు కట్టెలు తెస్తోన్న భార్యాభర్తని పట్టుకున్నారట. భార్యని రేప్‌చేసి, భర్తని ఎన్ కౌంటర్ చేసిపారేసారట. ఎన్నో యిలాంటి ఘోరాలట. గొడవలట.

ఈసారి-గొడవ-బస్తీలో వ్యాపారుల్తో వొచ్చిందట. బస్తీలో వ్యాపార్లు-రౌడీలను దించి కట్టెలు అమ్మకానికి తెచ్చినవార్ని కొట్టించేరట. అంతటితో ఆగక, పోలీసోళ్లనీ, ఫారెస్టోళ్ళనీ-వలస పైకి ఉసిగొలిపారట. దాడులూ, అరెస్టులూ, కేసులట.....! వలస వలసంతా-కార్చిచ్చుకి గురయిన అడవి అయ్యిందట! పరామర్శకు వెళ్లేడు నీలడు!

అత్తవారికీ, ఆ ఊరివారికీ ధైర్యం చెప్పి రావాలనుకున్నాడు. సంగం పెట్టకోమనీ, సంగమయి-తామెలాగా తమకెదురయిన దుర్మార్గాలన్నిటిమీదా తిరగబడుతున్నామో చెప్పాలనుకున్నాడు. తమ ఉద్యమాల గురించీ, తమ రాజకీయాల గురించీ యెరిగిన మట్టుకు వారికి వివరించి తరాత చంద్రన్ననో, మరో అన్ననూ తీసుకెళ్లి చెప్పించా లనుకున్నాడు. అంచేత-వెళ్లి, నాల్రోజులుండాలనుకున్నాడు! అయితే, యీ రోజు వాయిదా

వుందని గుర్తొచ్చింది. వాయిదాకిగానీ హాజరుగాకపోతే-తిపారం మేస్త్రీటు మంచోడుకాదని-భయపడి తిరిగొచ్చేసాడు. అంచేత, వాడికి, గ్రామసభా, నిర్ణయాలూ, ధర్నా భోగట్టా తెలీదు. అంచేత, ప్రశ్నలు వేసాడు.

ఆ ప్రశ్నలకు అదెయ్యి-మొహంలో మార్పు వొచ్చీసింది. మామూలుగా అయిపోయేడు. నీలడివేపు కళ్లనిండుగా చూస్తూ-

"....ధర్నా యెందుకా? డిమేండేటా? సెప్తానినుకో...!

పొద్దు-మా వొలసకి పడమరనున్న బోడికొండకి యెదరగ పొడుస్తంది. అందివల్ల-మా పోడు బీడుల్లోనా, పల్లపుభూఁవుల్లోనా పండిన పంటలు- మా యిళ్లకీ, మా కళ్లాలకీ బదులు బస్తీలకీ, బీరువాలకీ, బేంకీలకీ పోతన్నాయి.

అందిచేత-బోడికొండ దిశనయినా మార్సాల. పొద్దుపొడుపునయినా మార్సాల లేపోతే-మా తిప్పలు తీరవు. మా యిక్కట్లు యీడేరవు. మా కస్టాలు కడతేరవు!

ఔను, ఔనండి బావూ....! మా వొలసలకి రేసన్ సాపులుండవు. మా యిస్కూళ్లకి మేస్టర్లుండరు. మా నూతులకి నీళ్లుండవు. మా వొలసలకి రోడ్లుండవు. ఆస్పత్రులుండవు. మందులుండవు. వొయిదుగులుండరు. మా యింటికి పైకప్పులుండవు. మా ఒంటికి గుడ్డముక్కలుండవు. మా కడుపుకి మెతుకులుండవు....

ఇన్నిన్ని పథకాలు కురిసీసినా, యింతింత ధనరాసులు పోసీసినా-యిక్కడ గోసిగుడ్డలు, మసిబతుకులు, ఆకలికేకలు, ఆందోళనలు పోకండున్నాయంటే-పడమర బోడికొండ కారణం. ఆ బోడికొండకి యెదరగ పొద్దుపొడడం కారణం... అందిసేత, కొండనయినా మార్సాల. పొద్దు పొడుపునయినా మార్సాల-అదీ భోగట్టా! అదిరా, అందుకూ ధర్నా...." అని జవాబు చెప్పేడు.

అదంతా వినిన ట్టిపా గాడికి-కళ్ల మొయ్యా కోపఁవొచ్చింది. కానీ కక్కలేక ఆగేడు. కక్కలేకగాదు-సబువుగాదు, పదుళ్ల జనాలు తిరుగాడే కోర్టు స్తలం-ఫలానా సంగం పెసిరెంటుకి పరువుబోయిందంటే-మళ్లా అది మనకే, మన సంగానికే అగౌరువు గాదా? లేపోతే, కడిగీడమెంతసేపు....? నీలడేటడిగేడు? నువ్వేటి సెప్పేవు? అన్నిటికీ కయిత్వమేనా? మర్మమేనా? వొంకరమాట్లేనా? మనోళ్లుకాడా, మన జనం కాడా-అలాగేనా మాటాడతావు. నువ్వసలు మనోడివేనా? మా వోడివేనా? అనడిగీసి, కడిగీడమెంతసేపు...?

అని, ఉగ్రంగా లోలోపల ఊగిపోతూ; సెసే, యిక యితగాడి దగ్గిర వుంతే-యే క్షణానయినా జట్టీ, జగడం వొచ్చీసినా వొచ్చేస్ది-అన్నెప్పి; తన ప్రక్కనున్న రూల్సు గాడిని తీసుకొని, ఆ మర్రిచెట్టుకి, అటువేపు నీడలోకి నడిచేడు ట్టిపా.

రూల్సుగాడికి-మళ్లా, ఎల్లుండి ధర్నాకి వెళ్లాలనేసరికి -అవతల కమ్మాదొర యేమంటోడోనని భయంగా వుంది. ఈ వేళ వాయిదాకి తప్పదు, అలగే ధర్నాకీ తప్పదు-యివన్నీ తప్పించుకోలేనివి! కంబారి బతుక్కి-యిన్ని తప్పని తిప్పలా....? ఒక్క సారిగా వాడికి, వాడి బతుకుమీద చిరాకు వేసింది. ఆ చిరాకుతో-

"....మీటింగులు, సంగాలు, దర్నాలు, కోర్టులు, వోయిదాలు....ఔన్రా ట్టిపా- యేటిరా యివి మనకి? ఎన్నాళ్లురా మనకి?" అని ప్రశ్నించేడు.

కమీనిస్టుగా వున్నందుకూ, వున్నన్నాళ్లూ తప్పవు-అనబోయి, ట్టిపా-

"...కంబారి బతుకు బతికినందుకు, బతికినన్నాళ్లూ తప్పవే..." అనన్నాడు.

"....సెసే. కంబరికం వుండగూడదేసే. సచ్చినా వుండగూడదేసే. సచ్చినా యీసారి కంబారిగా పుట్టగూడదేసే. పుడితే -బుగతోడిగా పుట్టాలేస...." అని, నొక్కి చెప్పేడు రూల్సు.

"....బుగతగోరిగా యేటిరా-పుడితే యీసారి వొరల్డు బేంకీ పెసిరెంటుగా పుట్టాలరా! వొవ్వో...వొందలు వొందల దేశాల పెధానమంత్రులు, రాస్ట్రాల ముక్య మంత్రులు...వొంగొంగి దండాలే...దండాలు! ఆ మద్దెకాన-కమ్మాదొరగోరి టీవీల చూసినాను.

ఎవుళతగాను బావూ-అనడిగితే సెప్పాడు కమ్మాదొర! దొరే అన్నాడపుడు. పుడితే వొరల్టు బేంకీ పెసిరెంటుగ పుట్టాలరా-యీ బుగత పుట్టుగేల? సెసే... అనీ" చెప్పేడు - ట్టిపా.

రూల్సుగాడు-వొక క్షణం ఆలోచనలో పడ్డాడు.

ఔను మరీ. బుగతోడిగా పుట్టినా బాధలే. బుగత బాధలు బుగతకున్నాయి. కంబార్లని కాసుకోవాల. పన్చేయించుకోవాల. పంటలు పండించుకోవాల. పండిన పంటల్ని అమ్ము కోవాల. అమ్ముకోగా వొచ్చిన డబ్బు దాచు కోవాల....!

కంబార్లు-యింతకమునుపులాగ లేరు. కమీనిస్టు నంజికొడుకులైపోనారు! పంటలు-యింతకమునుపులాగ పండవు-ఎరువులూ, మందులూ, ఖర్చులెక్కువవతాయి. మార్కెట్-ఇంత కుమునుపులాగ లేదు-కాంపిటీననెక్కువైపోనాది. ఆకరికి, డబ్బు దాచుకోడంకీ-యింతకు మునుపులాగ బేంకులూ నమ్మకంగా లేవు....!

ఓర్నాయినా...! ఎన్నెన్ని బాధలు....! నిజంవే....బుగత పుట్టుకా...వొద్దొద్దు- అనుకున్నాడు రూల్సుగాడు.!

అంతలో కోర్టు బంట్రోతు-ఆరిక ఆదెయ్యా వగయిరాలూ-అని ఊళ వేసాడు! అందరూ కోర్టు హాలులోకి పరుగెత్తారు!

★★★

"...మొన్న మీకు కోర్టు వాయిదా! పొయ్యేరు. పొలంపన్లు సున్నా సుట్టేసారు. నిన్న అయ్‌గారికి-కోర్టువాయిదా, ఆయన పొయ్యేరు. పొలంపన్లు నిన్ననూ.... సుట్టేసుంటారు సున్నా. అయ్‌గారు లేకుంటే-పన్లు నడుస్తయా? అంత ధర్మరాజులా మీరు...? ఈ రోజు మళ్లీ మీరు ధర్నా కెళ్లొంటారు...యీ రోజూ పన్లు సున్నా! ఏంవిటట్రా యిది? నడస్తాదా- యిలాగైతే వ్యవసాయం? అదనుమీద జరగాల్సిన పన్లు....ఏంవిటట్రా యిది?"

రుక్మిణమ్మ రుసరుసలాడింది. రుస, రుస మాత్రమేకాదు -ఆమెకి యిదంతా యేఁవిటి? ఎందుకు జరుగుతోంది? ఎలా జరుగుతోంది? ఇది యెటు దారి తీస్తుంది? అసలిది తమకి లబ్ధి చేస్తుందా? నష్ట పెడ్తుందా? ఎలా వొచ్చేమిక్కడికి! వొచ్చాక ఎలా బతికేఁవు? నిన్న యేఁవిటి? రేపు ఏఁవిటి? ఈ రెంటి నడుమ యీ వేళ-వర్తమానమేఁవిటి అన్న అనేకానేక ప్రశ్నలు అంతరంగాన క్షణక్షణమూ పొడిచి, పొడిచి....పూర్తిగా జవాబులు దొరకకా, ప్రశ్నలు రద్దుగాకా, భర్తను దూషించటమూ, పరిస్థితులనా, పనివాళ్లనా...తననుతానా యిలా స్థిమితరహితంగా వుందామె!

ఎలా వొచ్చేఁవు?

తక్కువ ధరకు భూఁవీ, తక్కువ కూలికి మనుషులూ, తక్కువ పెట్టుబడి, యెక్కువ లాభఁవూ వొస్తుందంటే-ముందెన్నడో వొచ్చిన రంగనాథ చౌదరి చెప్పిన మాటలకు-యీ చౌదరీ సై, సై అన్నారు. అక్కడి భూఁవీ, పుట్టా ముందు తనఖా, తర్వాత అమ్మకమూ చేసీసారు.

నిజఁవే. తక్కువ ధరకే-యెక్కువ భూఁవి దొరికింది. అక్కడ సాధారణ సన్నకారు రైతు-యిక్కడ ఆసామీలం అయ్యేఁవు! దొరగారూ, దొరమ్మా అయినాం! బోర్‌వెల్సూ, మోటార్లూ, ట్రాక్టరూ....పత్తీ, మిరపా, చెరకూ, అరటీ పంటలే పంటలు! ఎదిగేం....! ఏటకేటా ఎదిగాం..!

మరి, యీ కేసులేఁవిటి? గొడవ లేఁవిటి? ఈ అడ్డంకి లేఁవిటి? ఎప్పుడు, ఎక్కడ పడింది- మా ఎదుగుదలకి అడ్డంకి? ఎవరేసారు? వీళ్లేనా? యీ మూడడుగుల వామనరూపిగాడూ, యీ రివట రూల్సు గాడూ, ఆదెయ్యా, యీ గోసిపాత గాళ్లేనా...? వీళ్లేనా...?

సాధనాలు వీళ్లు కావచ్చుగానీ-కీలకం వీళ్లుగాదు. వీళ్ల సంగం పార్టీ. పార్టీ నాయకత్వం.....

అప్పటికీ- ప్రతి అడుగూ ఆచితూచి వేసామే! అధికార యంత్రాంగంతోనూ, అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకుల్తోనూ, మతసంస్థలతోనూ....శివాలయమంటే హిందువులకూ, చర్చి అంటే క్రైస్తవులకూ చందాలు-అందరికీ యిచ్చామే! అందరితోనూ సత్సంబంధాలు కలుపుకోవటంకాదు, నిలుపుకోవటం కాదు-బలపరుచుకుంట వచ్చామే! వారందరూ-అధికార్లు చట్టాలపరంగా, రాజకీయులు రాజకీయపరంగా, మతసంస్థలు మతపరంగా-యెంతగా సహకరించాలో, అంతగా సహకరిస్తున్నారే....! ఇంకా.... యిక్కడ...యీ యిబ్బందులేఁవిటి? ఈ గొడవలేఁవిటి? ఈ కేసులేఁవిటి? ఈ కేకలేఁవిటి?

రుక్మిణమ్మకు-మనసంతా కోళ్లు దువ్విన పెంటకుప్ప అయ్యింది. చిరాకు, చిరాకుగా వుంది. తన మీద తనకే కోపమొచ్చింది. ఈ కోపంలో కాసేపు యీ చౌదర్ని పెళ్లి చేసుకుని వుండాల్సిందిగాదు. ఏ బిజినెస్ మేన్నో, యే గెజిటెడ్ ఆఫీసర్నో చేసుకు నుండాల్సింది. వుండాల్సిందే; గానీ, మనకా తలరాత యేదీ? మనకంత సీన్ యేదీ?

మన పుట్టింటి పునాదికి-యింతే భవంతి లేస్తాది. మనం వెలగబెట్టిన చదువుకి-ఆఫీసర్లెలగొస్తారు? ఈ చౌదరే వస్తాడు!

అని, అంతలోనే తన స్థాయిని గుర్తించి, కోపంతో కలిగిన చిరాకుని చెరుపుకుంటూ-అయినా, యీ చౌదరిగారికేం? అక్కడేమో గానీ, యిక్కడ భూఁవీ, పుట్టా కలిగిన ఆసామీ అయ్యేడు, అందగాడు, మంచోడు ...! మనం ఎంతంటే అంత-యేదంటే అదే...! మన మాట వింటాడు...!

అందరూ....వింటారు మన మాట! గానీ; వీళ్లు, వీళ్లు, వీళ్లే వినరు...అనుకొని, గడపలో నించొని, ఆలోచనలు ఆపి, ఎదురుగా చూసింది రుక్మిణమ్మ.

ఎదురుగా-తొలగించవొల్లగాని శత్రు సేనాధిపతుల విగ్రహాల్లా-నీలడు, రూల్సుగాడూ, ట్టిపా నిల్చున్నారు.

పీ.వో. ఆఫీసుకు ధర్నాకు వెళ్లాల్సి వుందమ్మా వెళ్తున్నామని చెప్పి, వెళ్లబోతుండగా రుక్మిణమ్మ వేసిన ప్రశ్నలకు-యీ కోర్టు కేసులు, ధర్నాలు, పనులు బంద్-యివన్నీ యెందుకూ, యెన్నాళ్లూ-అన్న ప్రశ్నలకు-వాళ్లు ప్రశ్నార్థకంగా నిల్చున్నారు.

రుక్మిణమ్మలానే వాళ్లూ, అంతరంగంలో అంతసేవూ మౌనంగా తర్కించుకున్నారు. ముందుగా, ట్టిపా తేరుకొని, ఆలోచనలాపి-

"....ఔను. ఏల? ఏలమ్మా యివన్నీ?' అని రుక్మిణమ్మ కళ్లలోకి చూస్తూ ప్రశ్నించేడు.

రుక్మిణమ్మ-గభాల్న చూపులు మరల్చు కుంది. వాడెప్పుడూ-నేరస్థునివేపు చూసేట్టు చూసి, ప్రశ్నిస్తాడు. సరిగ్గా-నేరాన్ని పట్టుకొని యెత్తి చూపుతాడు. తొట్టతొలి పర్యాయం... ఆనాడు...యిలాగే....

చద్దన్నాల వేళ. కొసవలస జనాలు-పనీ పాట్లకు వెళ్లినవారు పొలాలలోనా, కళ్లాల లోనా; పిల్లలూ, ముసలివాళ్లయితే యిళ్లల్లోనా-గెంజికూడు తినేవేళ! పశులకాపర్లు-బుగతల యిళ్లనించి చద్దన్నాలు తమ యిళ్లకు తెచ్చుకొని, యింట్లోని ముసలీ, ముతకా, పిల్లల్తోపాటు తింటారు! గానీ, ఆ రోజు, ఆ వేళలో-

రుక్మిణమ్మ యింటెదురుగా వీధి బాటలో-జనం మూగిపోయేరు. చద్దన్నాల తపేళాలను వీధిబాటలో వరుసగా-గ్రామ దేవతలకు సమర్పించే ఓరేల్లా వుంచి, గుమిగూడిన జనానికి చూపిస్తూ-

"...సూడండి, సూడండి. సూడండర్రా సూడండి. ఈ సల్లంది బువ్వల వోసన సూడండి. నీరోడతన్న మెతుకులు సూడండి. పాచిమెతుకులు పాచివోసన! ఈ సల్లంది బువ్వతింతే-కడుపు లోపల్ది కక్కుకుంతారో లేదో సూడండి. సూడండర్రా..." అని ట్టిపా అందరికీ చూపించేడు. వాడికిటూ, అటూ పశులకాపర్లు...కోపంగా!

రుక్మిణమ్మ గుంపు దగ్గరకుచేరి.... యేఁవిటన్నట్టు ట్టిపా వేపు చూసింది. ట్టిపా-

"....అమ్మా, చౌదరమ్మా-యిది సద్ది కూడేనా? యిది మనుసులు తినేదేనా? ఈ పాచికూడు తిని, మీ పాచిపనులు చేసీసి, మీ పశులమందల్ని కాపుగాసీసి, మీకు సేవలు జేసీయాలా....? సూడమ్మా, సూడీ.... సద్దికూడు...." అని, సద్దన్నపు తపేళా వొకటి తెచ్చి, విసురుగా రుక్మిణమ్మ మొహమ్మీదకు తెచ్చి చూపేడు.

రుక్మిణమ్మకు తలకొట్టేసినట్టయ్యింది. గభాల్న తమాయించుకొని-

"....అయ్యయ్యో! పాచిపోయిందా చద్దివొన్నం? ఔనర్రా...! అయ్యయ్యో-వంట మనిషి నరసమ్మ చూసుకొనుండదర్రా... అయ్యయ్యో....యేఁవిలా జేసింది నరసమ్మ? చెప్తాలేర్రా...."అని సర్దుబాటు చేయబోయింది.

"...యేటి సెప్తావు? ఎపుడు సెప్తావు? రోజూ -యిదే బాగోతం...."అని, ఈసడించాడో పశులకాపరి.

"...అయ్యో, నాకు తెలీదర్రా...."

"...యేటి తెలదు....?"

"పాచివొన్నం అని తెలీదర్రా...."

"....తింటే తెలుత్తాది...."

"....ఛఛా... పాచివొన్నం పెట్టమంటానా? మీరు మాత్రం మనుషులు కారర్రా...?"

"...మీలాంటి మనుసులుం కాదుగదా"

"...నాకలాంటి తేడాలుండవర్రా.... అందరం వొకటే"

"...అయితే సద్దికూళ్లు-నీ పిల్లలకి తినిపించమ్మా. నువ్వూ, నీ పెనిమిటీ కలిపి తినండమ్మా..."

అంతే. రుక్మిణమ్మ సహించలేక పోయింది.

కోపంతో కేకలకు దిగింది.

"...యేంటటా? యేంటి మీ రుబాబు? ఆఁ? యేదో వొకరోజుకి-పొరపాట్న, చూడనందున పాచికూడు పెడితే-యింత రాద్దాంతమా? ఇంటిముందర నామీద పంచాయితీయా? ఈ కూడు-నా బిడ్డలకెట్టమంటారా? మమ్మల్ని తినమంటారా? యేంటి-కిందూ, మీదూ కానని కబుర్లా? పోనీలే, పొరపాటుందిగదా అని- ఊరుకునుంటే-పెద్దా, చిన్నా లెక్కచూడక మాట్లాడ్తారా? మీద, మీదకొస్తారా? పొండిరా; మీకోసం ఉడుకుడుకు వొన్నం వొండిపెట్టే రివాజేంలేదు. రాత్రికి మిగిలిపోయిన వొన్నఁవే పెడ్తాం. అదే తినండి...లేకుంటే మానండి. పొండి...యేం చేస్తారో, చేస్కోండి.' అని, పశులకాపర్లకు జవాబిచ్చి; విసురుగా, వీధిగేటు మూసేసి; వాకిలి గడపలో కొచ్చేంది రుక్మిణమ్మ.

ట్టిపా-కాసేపు దీర్ఘంగా ఆలోచిస్తూ వుండిపోయేడు. మూగిన జనం...యేవో గొణుక్కుంటూ, వొక్కొక్కరూ వెళిపోయేరు. పశులకాపర్లు మాత్రం-అసహనంగా, అలాగే నిల్చున్నారు. చద్దిగిన్నెల్ని-చౌదరిగారి వీధి గేటుకెదురుగా, వరుసగా పెట్టండన్నాడు ట్టిపా. పశులకాపర్లందరూ-గిన్నెల్ని వరుసగా పెట్టేరు. ఆ తర్వాత-చౌదరిగారి సాలల్లోని ఆవుల్నీ, దూడల్నీ-కట్లువిప్పి వొదిలెయ్యండన్నాడు. వొదిలేసారు. దూడలు వీధుల్లోకి, ఆవులు పొలాల్లోకీ దౌడు తీసేయి.

ట్టిపా, పశులకాపర్లూ-చౌదరిగారి వీధి గేటు దగ్గర నిల్చున్నారు. మొదట ట్టిపా తన చేతిలోని 'గొడిముక్క' (పశువుల్ని తోలేందుకు వాడే కర్ర)ను విసిరేడు. గొడి ముక్క తిన్నగా వెళ్లి-రుక్మిణమ్మ ముందున పడింది. మిగిలిన పశులకాపర్లూ-విసిరేరు. ఆ తరవాత, మారుమాటడకుండా అక్క డ్నించి వెనుదిరిగేరు.

సాలలు పేడకంపు, దొడ్లు పాచికంపూ గొట్టేయి. దూడలు-ఆవుల పాలు తాగేసేవి. పశువులు చేలు మేసేసేవి. చౌదరమ్మ-పేడ లెత్తీ, పాచిపన్లు చేసీ; చౌదరిగారు పశులు గాసీ-పళ్లుదిని గింజలు ఊసేరు.

గానీ, ఫలితం లేకపోయింది. తమకేగాక, మిగిలిన చౌదర్లకీ, నాయుడోరికీ... యిబ్బంది కలిగింది. పెంట పనులూ, పాచితగువూ-సాగదీయొద్దనుకున్నారు.

రాత్రి మిగిలిపోయిన కూడుగాక, పొద్దుటిపూట వండిన కూడు-చద్దికూడుగా పెట్టాలనీ, చలికి దుప్పటీ, సంక్రాంతికీ, కొత్తా మావాస్యకీ రెండు జతల కొత్తబట్టలు కొనాలనీ, యేటా జీతం పుట్టెడు ధాన్యం పెంచాలనీ-షరతుల అంగీకారంతోగానీ పాచి తగవు తీరలేదు. గొడిముక్కలు-చేతుల్లోకి తీసుకోలేదు పశులకాపర్లు.

గొడిముక్క, చేతిలోకి తీసుకుంటూ ట్టిపా చూసిన చూపు-రుక్మిణమ్మ మరచి పోలేదు. విజయసాధకుల చూపు-అది!

ఈవేళ-సరిగ్గా-అలా చూస్తున్నాడు వీడు-అనుకుంది. జాగ్రత్తగా మాట్లాడాలి సుమా-అని తననుతాను లోలోపలే హెచ్చరించుకుంది.

తొలినాళ్లలో, పరిస్థితులు గ్రహించలేక, బలాబలాలు తెలియకా, పశులకాపర్లతో గొడవపడీ, భంగపడినట్లు-తర్వాత్తర్వాత పడలేదు.

పడలేదంటే-గొడవలే పడలేదనిగానీ, భంగపడలేదనిగానీ కాదు. గొడవలూ, భంగపాట్లూ-తమవి గాకుండా, తమ సహచర బుగతలవో, స్థానిక పాత బుగతలవో అయ్యేట్లు జాగ్రత్తపడ్డారు. తాము-పెద్దమనుష్యుల్లాగా, తీర్పరుల్లాగా వ్యవహరించగలిగేట్టు చూసుకున్నారు. గానీ, అది, యెన్నాళ్లో సాధ్యంగాలేదు. యేదో వొక వైపుకు వొరిగేట్టు-పరిస్థితులు నెడుతుండేవి. వొరగటమే తప్పనిసరయినపుడు-తమ సహచర బుగతలవేపుగాక-వీళ్లవేపు వొరగగలమా? ఒకవేళ, వొరిగినా-వీళ్లు నమ్ముతారా...?

అననే అన్నాడు-ఆ ఆదెయ్యగాడు-సంగం ఆఫీసు బిల్డింగు గొడవ జరిగి నపుడు....

"...యేనాడూ మీము మిమ్మల్ని నమ్మలేదు. మాకు తెల్దేటి..యే గూటి పిట్టలు ఆ గూటికే చేరతాయనీ, ఆ పలుకులే పలుకుతాయనీ!

అయితేటీ...?

ఇవతల, యేనాటినుంచో, యింకా, యికా మా నెత్తిమీద కాళ్లేసి, నొక్కీ తొక్కీసి-మమ్మల్ని అరిగోసబెట్టిస్తన్న-యిక్కడి బుగతలు, ఫారెస్టోలు, రెవిన్యోలు, పోలీసోల్లు...ఈళ్లందర్తోనీ-యెలాగూ వైరం వుండనే వున్నాది.

కొత్తగా మీరొచ్చినారు. సఖ్యంగున్నట్టుగ అవుపించినారు. మంచిదే-బుగతలయినంతమాత్రాన-వైరమేల? చూద్దుం అనుకున్నాం...! రా(న్రానూ, యెటువేపు వొరుగుతారో సూద్దుమనుకున్నాం. మీరు అటే వొరిగేరు....! మీకంటాముందొచ్చిన చౌదర్లూ-వైరిపక్షమే వొరిగేరు..." అనన్నాడు.

అపుడు, అదికాదు ఆదెయ్యా-అని తనేదో చెప్పబోయింది. చౌదరిగారూ సౌమ్యంగా వివరించబోయేరు. గానీ, విన్నాడా? విన లేదు!

"...యేం తల్లీ? యేం తండ్రీ..? శివాలయం యెక్కడ గట్టేరు? పంచాయితీ స్థలాన! చర్చీ యెక్కడ గట్నారు..? పంచాయితీ స్థలాన! కాదా? చెప్పండి-కాదా? పంచాయితీ స్థలాలనే గదా గట్టినారు...? మరి, మీము -మా సంగం ఆపీసు యెక్కడ గట్నాం...? పంచాయితీ స్థలంలోనే గదా...? మీ కళ్లాల్లోనగానీ, మీ జిరాయితీ భూంవుల్లో గానీ, మీ తోటలూ, దొడ్లలోన గానీ-కట్టలేదు గదా? రాంవినాయుడు, సోంవినాయుడు, గుర్నాయుడు-పాత బుగతలు అంతా-గుర్రుమన్నారు! కొత్త చౌదర్లు...కయ్ కయ్యమన్నారు. యేంవీ? యెందుకూ...? ఓహో....అదన్నమాట! ఆంహో.... అలా గన్నమాట! మా పేదలకి ఆస్తిపాస్తులేవీ వుండనట్టే-సంగాలూ, సంగానికి ఆఫీసులూ వుండగూడదన్నమాట!.. ఆహాం.....అదన్నమాట...."అని, బుగతల బుద్ధుల్ని వెటకరించాడు ఆదెయ్య.

"వుండొద్దన్లేదుగదయ్యా. ఆఫీసు-మీ స్వంతస్థలంలో కట్టుకోండి. యెవరొద్దంటారు? గవర్నమెంట్ స్థలం కాబట్టీ-అబ్జెక్షనంటున్నా" -"ము" అనాలో; "రు" అనాలో తేల్చుకోక, గొణిగేరు చౌదరిగారు.

"గవర్నమెంటు స్థలమయితే-మీ కందరికీ అబ్జెక్సనెందుకండయ్‌గారో? మీరందరేల-సిలకట్లెగగట్టుకొని, బాణాకర్ర లొట్టుకొని-డీచ్‌బబ్బా అనొచ్చేరు-సంగం ఆఫీసు మీదకి?" ఆదెయ్య ప్రశ్నిస్తే, చౌదరి గారేమీ జవాబు చెప్పలేక మౌనం వహిస్తే; తనుగదా, కాస్త వివరంగా, విషయం చెప్పబోయింది. తమని అర్థం చేసుకోమని కోరింది. పేదలు-మీరందరూ సంగం అయి నట్లే-భూస్వాములూ-కలిసికట్టుగుండాలనీ; యీరోజు నిరోధించకపోతే.. .సంగంవాళ్లు... యింకా, యింకా రెచ్చిపోతారనీ; యిపుడు గవర్నమెంటు స్థలాలు ఆక్రమించు తున్నారు; రేపు బుగతల దగ్గర భూము లెక్కువున్నాయనీ, సీలింగు దాటివున్నా యనీ, ఏజన్సీ యాక్టు అనీ-యేదోదో అనీ, మన భూంవులు ఆక్రమిస్తారనీ-వాళ్లంతా తమ చెవిలో యిల్లు గట్టి చెప్పారని చెప్పింది ఆదెయ్యకి. ఆఖరిగా-

"...మొక్కగా వున్నపుడే వొంచీయాల. మానుగానీ అయితే వొంగుద్దా-అనన్నారయ్యా...." అని చెప్పింది రుక్మిణమ్మ. నిజానికామెకిగానీ, చౌదరిగారికిగానీ, యీ గొడవలు యిష్టంలేదు. ఇష్టంలేదంటే అర్థం-వారి మనసుల్లోపలలోపల- యేదో శంక దొలుస్తుండేది. అది-గొడవకు సంబంధించిన న్యాయాన్యాయాల గురించో, జయాపజయాల గురించో...?

దానికి తగ్గట్టు, ఆదెయ్యగాడూ-అలాగే హెచ్చరించేడు.

"...మొక్కా? వొంచెస్తారా? తల్లీ, చౌదరమ్మా మొక్కా...? అలగే...అలగే అనుకొని చెయ్యి యెయ్యండి...? మొక్కే! యేసినపుడు-యిది వేప మొక్కగానీ, తీయబోనావా అమ్మోరు మొక్క...అది! అఁ! చెయ్యేయ్యండి...." అని తాటించేడు.

చేతులేసినందుకు-నాయుడోళ్లకీ, చౌదర్లకీ దెబ్బలు తగిలేయి. వీళ్లకీ తగిలేయి. గానీ, వీళ్లు, రాటుదేలిపోయేరు. ఆ మొక్క-అమ్మోరు చెట్టు అయిపోయింది.

వాళ్లమాట వాళ్లది, వాళ్ల పాట వాళ్లదీ! కూలిరేట్లు, పట్టాభూఁవులు, సంత వ్యాపా రాలు, చదువులు, వైద్యం, ఆఫీసులు-ఆఖరికి పంచాయితీవార్డు పదవి నిండి, పార్లమెంటు సభ్యత్వం దాకా-వాళ్ల పోటీ..! వాళ్ల ప్రత్యామ్నాయం!

కడుపు మండుకొస్తోంది రుక్మిణమ్మకు. ఉక్రోషంగా...నిల్చున్న ముగ్గురివేపూ చూస్తోంది.

".....అమ్మా....అవతల అయ్‌గారూ, చౌదరిబాబులూ, నాయుళ్లూ-మీటింగులు న్నట్టిగుంది? ఎంతెంతేసి ఆలోసన్లుసేస్త న్నారో-అలసిపోయుంతారు గావాల? తిండానికీ, తాగడంకీ-యేటేన యెడతావు గావాల? బేగి, యియ్యండమ్మా. అయ్‌గార్ల కాడ యెట్టేసి, దర్నాకెళ్తాఁవు...." అనన్నాడు ట్టిపా.

అతని వెటకారం బోధపడి, మరింత కడుపుమంట పెరిగింది రుక్మిణమ్మకు.

"...వొర, బుగతలకి అన్నీ అమిర్సిపెట్టి, ఆ తరాత మనం యిళ్లకెళ్లీ డ్రెస్సుమార్సీ-డ్రెస్సులంతే-సూటూ బూట్లు అని కాదు గానీ-యీ బనీను గినీన్లు మార్చుకొని, జెండాలు వెదికిపట్టుకొని, వీధిలోనోళ్లని బయలెళ్లదీసీ సరికి-యెంతేళయిపోద్దో...? పదేస్. అవతల, పెసిరెంటు-కోపమయి పోగల్డు...."అని తొందరచేసాడు నీలడు.

రుక్మిణమ్మ-వొక్కక్షణం ఆగురా-అని ట్టిపాకి చెప్పి, లోనకి నడిచింది. నీలడు-ముందుగా తను వెళ్లి, వీధివాళ్లనందర్నీ బయల్దేరదీస్తానని చెప్పి వెళిపోయేడు.

ఒక ట్రేలో-టీ కప్పుల్తో వొచ్చి; ట్టిపా చేతికిచ్చి; అయ్యగార్లకు యిచ్చేసి రమ్మంది. చౌదరిగారి యింటికి ఈశాన్యంవేపు గల వొక పొడవాటి పర్ణశాల వేపు నడిచేడు ట్టిపా, టీలు తీసుకెళ్తూ.

"...రూలుసూ; నువ్వూ వెళ్లాలా ధర్నాకి...?" అనడిగింది రుక్మిణమ్మ యెదురుగా వున్న రూల్సుగాడిని.

"...యెళ్లాలనీ రూలుసు లేదు. యెళ్లొద్దనీ రూలుసు లేదు. గానమ్మా-రూల్సులేవని యేటి మానేస్తాం? రూల్సులేవని-దేవుడికి దండం పెట్టడం మానేస్తామా?

దారిలోన ముల్లంటే-రూల్సులేవని తియ్యడం మానీసి అడుగేసెస్తామా? రూలును లేవని-పగటి పూట పన్చెయ్యటం; రాత్రిపూట నిద్రోడం మానెస్తాఁవా? ఏటి మానేస్తాం?

రూలును పెకారం-పాచికూడు తిండం మానేస్తాం. పాపపు పనులు చెయ్యటం మానేస్తాం. రూలును పెకారం-దున్నినోడిదే భూఁవి అనడం మానేస్తామా? సెవటసుక్క పోసి పెంచినోడిదే-మొక్క అనడం మానెస్తాఁవా?

రూలుసంతే యేటంటే-రూలును పెకారం నడండిరా మానవుల్లారా-అని రూల్సు సెప్పటం అన్నమాట, కదమ్మా..?" అని, ఆ విధంగా పర్ణశాలనించి తిరిగి ట్టిపా వొచ్చేంత వరకూ; రూల్సు ప్రకారం మాని వేయగలవీ, మానివేయలేనివీ-యెడతెగని వివరణ యిచ్చేడు రూల్సుగాడు.

రుక్మిణమ్మకు శరీరమంతా కంపన మొచ్చి, గడపలోనున్న సోఫాలో కూలబడి పోయింది.

అప్పుడే-చౌదరిగారి వాకిలిగేటు దగ్గర నించి నీలగాడు-

"...ఓరే, మనోళ్లంతా రడీ అయిపోనారు. అదిగో, ఆదియ్య యింటి ముందర జమయినారు. రండి, రండి...."అని కేకేసాడు.

ట్టిపా వొచ్చేడు. రూల్సు మాటలాపేడు.

"...ధర్నా అయిపోగానే, పారొస్తామమ్మా పనుల్లోకి...." చెప్పి, నడిచేడు ట్టిపా.

రుక్మిణమ్మ, సోఫాలోంచి లేచి-

"...వొరే ట్టిపా; మీ చంద్రన్నగానీ వొస్తారేంట్రా, యీ వేళో, రేపో...?" అని ప్రశ్నించింది. సూర్యోదయం-యీ వేళగానీ, రేవుగానీ అవుతుందా-అని ప్రశ్నించినట్టన్పించిందామెకు! అదోలా, అయిపోయిందామె, ప్రశ్నించాక.

ట్టిపా మాత్రం గతుక్కుమన్నాడు. ఎందుకీవిడ చంద్రన్న గురించి ఆరాలు తీస్తోంది? ఎందుకు తూకం వేస్తోంది? ఎందుకు...?

"...యీ గొడవలన్నీ యెందుకురా?" మళ్లీ ప్రశ్నించింది రుక్మిణమ్మ.

సరిగ్గా-మొన్నటి రోజు కోర్టులో రూల్సు గాడు-తనని అడిగిన ప్రశ్నే...! అయితే రూల్సుగాడు- యీ గొడవలెన్నాళ్లు? అనడగాడు! ఈవిడ-ఎందుకు? అనడుగుతోంది....!

"....నువ్వు చెప్పలేవులేగానీ, చంద్రన్న వొస్తే, వోసారి కలిసి మాటాడాలిరా. ఆయన మీద-మాకేం కోపం లేదు. నిజం. చంద్రన్న లాంటి మనుషులుంటారట్రా- యీ రోజుల్లో? స్వంత యిల్లూ, పిల్లజెల్లా కుటమాల్నొదిలి, ప్రజలకోసఁవని, యిలాగ కొండ కోనల్లో, మీ గడపల్లో పండుకొని, మీ గంజినీళ్లు తాగి...ప్చ్‌ప్చ్....వుండరుండరు.. ప్చ్‌ప్చ్...." అని, నొచ్చుకుంది రుక్మిణమ్మ.

ట్రిపా-ధర్నాకెళ్లే తొందర్లో నున్నాడు వొకవేపు. మరోవేపు-రుక్మిణమ్మ-చంద్రన్న గురించెందుకారాలు తీస్తోందన్న ఆలోచనల్లోనున్నాడు. మౌనంగా ఆలోచిస్తూ, వెళిపోతుంటే-

"...మీ చంద్రన్నొస్తే, వోసారి మాట్లాడాలన్నానని చెప్పుమీ. ఈసారొచ్చినపుడు-మా యింటినించే బోయినం కేరేజొట్టు కెళ్లవులే...యేం...?" అని వెనక నుంచి రుక్మిణమ్మ కేకేసి చెప్తోంది.

★★★

ట్రిపా-వెళిపోయేక-రుక్మిణమ్మ కాసేపు సోఫాలో కూర్చొని, తలపట్టుకుంది. ఈ భూఁవులూ, వీటిల్లోని పంటలూ, వాటివల్ల వొచ్చే మిగులు ధనంతో యిక్కడే వొక ఫేక్టరీ పెడితేనో...? కొంత ఋణం-యే బ్యాంకులో అయినా తీసుకోవొచ్చు. ప్రభుత్వమెలాగూ-సబ్సిడీ యిస్తుంది. ఏ ఫేక్టరీ పెడదాం...? ఏది లాభదాయకం...? ఏది...? అని, ఆలోచిస్తూ వుండగా-

"...యే ఫేక్టరీ అయినా ఫరవాలేదు. పాతతరం వారిలాగా-యే జూట్ ఫేక్టరీయో, సుగర్ ఫేక్టరీయో అనకుండా-యీ ఏజన్సీ లోన రకరకాల అడవి పంటలున్నాయి. వాటికి సంబంధించి పెట్టొచ్చు. బయో టెక్నాలజీకిపుడు మార్కెట్ బాగుంది- అందుకు సంబంధించైనా పెట్టొచ్చు. ఇలాగ, కొత్తవేవో పెట్టడంకి ఆలోచించు. ఏదో ఒక ఫేక్టరీ పెట్టు. పెట్టిన కొద్దినాళ్లకే- నీ పెట్టుబడీ, దానిమీద నువ్వాశించిన లాభమూ-లాగెయ్యి. ఇకా తర్వాత ఆ ఫేక్టరీని యే క్షణాన్నయినా మూసెయ్యడానికీ, మరోదాంట్లో కలిపీడానికీ సిద్ధంగా కాళ్లూపుకుంటూ కూచో!

శాశ్వితంగా- యే బిజినెస్సూ, యే ఫేక్టరీ, యే ప్రాంతమూ-నీ గుప్పిటిలో వుండిపోదు. మనుషుల్తోనూ, మట్టితోనూ, యంత్రాల్తోనూ-యంత్రాంగాల్తోనూ-తాత్కాలిక సంబంధాలే తప్పా; శాశ్వత సంబంధాలకు యిది కాలం కాదు.

ఎప్పటికప్పుడు, యేదో వొకటి, దొరికిన కాడకి ముక్కునకరచి-యెగిరిపోటానికి సిద్ధంగా వుండు.

ఎన్నిచోట్ల, యెన్నిసార్లు ముక్కుముంచి, చేపల్ని కరచుకుపోతుందో కొంగని గమనించేవా..? మనఁవింకా కొంగలమే! గ్రద్దలు, రాబందులు, యింకా రాకాసులు-మనకంటే బలమయినవి వున్నాయి సుమా...!" అని, హరి ప్రసాద్ చౌదరి, ఆ మధ్య యింటికొచ్చినపుడు, యిది మన ఫిలాసఫీ....అని చెప్పేడు. కొంగల ఫిలాసఫియా-అని గూడా తను నవ్వించపుడు.

అది గుర్తొచ్చి, రుక్మిణమ్మకు -బెంగ వేసింది. గెద్దలు, రాబందులు, రాకాసుల మధ్యెన పోటీపడలేక గదా-యిటువేపు వొచ్చేం! అవి-యిటువేపు గూడా వాల్తాయి సుమా-అనిగానీ చెప్పాడా హరిప్రసాద్...? బలిష్టమయినవారితో అనుబంధంగాక-విరోధమే వున్నదా? వామ్మో..అని బెంగపడింది!

బలహీనమయిన వాళ్లో...? చేపలా! వీళ్లా...? కారు, కారు...వీళ్లనలు చేపలేంటి...? నా మొకం...! వాడెవడో రాసి నాడుగా-మేకలు పులుల్ని యెంటదగుల్తయట; సిలకలు కత్తులు దులపరిస్తయటా-అని! అట్లాగే వుంది! వీళ్లట్లాగే వున్నారు...!

అసలు-యిటు రాకపోయుండాల్సింది.

అదేం లేదన్నారు. ఫర్వాలేదన్నారు. చిలుకల్ని-నెత్తురు గక్కించేసారు. మేకలను-బలులు గావించేసారు. చెఁవర పిల్లుల్ని-వలవేసి, వేటాడీసేరు. ఇపుడంతా-సజావుగా వుందన్నారు.

కావోసనుకున్నాం. వొచ్చేం. చూసేం. అవుననుకున్నాం. అయినా-వొచ్చి చెడి పోలేదుగా! బాగుపడినాముగా! ఇటు రాకుండా-అక్కడేగానీ, వుండిపొయ్యి ఉంటే-ఆసాములయ్యి వుందుమా? మిగులుధనం కూడబెట్టి వుందుమా? ఫేక్టరీయేదో పెట్టే ప్లాను చేసి వుందుమా? ఈ రుక్మిణమ్మ-వో ఫేక్టరీకి ఎం.డీ. అన్పించుకోగలిగే రోజు వొచ్చి, చస్తుందా...?

ఛ...ఛా...రావటం తప్పుగాదు. ఒప్పే....! ఒప్పే... అయితే- హరిప్రసాద్ చెప్పినట్టు-యెగిరిపోటానికి సిద్ధంగుండాల...?అఁ!?

అలా, ఆలోచించుకు, నిర్ణయాని కొచ్చాక, ఆమెకు బెంగపోయింది. సోఫా లోంచి లేచి, పర్ణశాలవేపు నడిచింది.

★★★

పర్ణశాలలో -రుక్మిణమ్మ భర్తా, నలుగురు చౌదర్లూ, సొండి బంగారీ, గిరిజన పెద్దా, మాజీ సమితి అధ్యక్షుడూ బాయలన్న, తాజా మండల అధ్యక్షుడు రాఁవి నాయుడూ, కలప స్మగ్లర్ కురిమినాయుడూ కూచుని, చుట్టలూ, సిగరెట్లూ కాల్చి, టీ, కాఫీలు తాగి, కండువాలు దులిపి, తొడలు గొట్టీ, మీసాలు నులిపీ, పంచేలాల్చీలు దులిపీ-యింక చెయ్యటానికి మిగిలినవేమీ లేక -మళ్లీ మళ్లీ అవే పన్లుచేస్తూ-యెడతెగని సంభాషణలో మునిగివున్నారు.

వారంతా-మొదట కేంద్ర రాజకీయాల్ని ముచ్చటించుకోబోయేరు. రాజకీయాలంటే-వారందరి అవగాహనలో-ఎన్నికలూ, అందులో గెలుపు, ఓటములే!

వొక కూటమి వోరు, దేవుడిమీద భారమేసి బరిలోకి దిగిపోయి వోడిపోనారు. వోడిపోరేటి...?

దేవుడొక్కడేటి? ఎవుడి దేవుడు ఆడికి లేడేటి? నీ దేవుడు నీకు యెంత దేవుడో-అవతలోడికి ఆడి దేముడు-అంత దేముడు...! కదా?

ఔనుగానీ-అసలకి ఆళ్లకి రామభజన తప్పా, రాచకీయం రాదువయ్యా.

ఇవతల కూటమివోరికి రాసకీయం-గాంధీగోరు రాట్నం వొడకటం నేర్పినట్టు నేర్పిసినార్టువయ్యా. అందికని, యీళ్ల ముందు ఆళ్లు తూగులేరువయ్యా.

ఇలా, ఓటమికీ, గెలుపుకీ తలో తీరులో కారణాల్ని చూపించి, భిన్నాభిప్రాయాల్ని, గొంతులు సకిలించి మరీ ప్రకటించుకున్నారు. అక్కడకు కేంద్రం ముగిసింది, రాష్ట్రానికొచ్చీసారు.

ప్రెపంచ బేంకీ మీద భారమేసి-బరిలోకి దిగి వోడిపోయేడొకడు. రోయిణీ కార్తె ఎండల్నీ, కాలిపోయిన మోటారింజిన్లనీ, కరెంటు తివ్వల్నీ, కడుపుమంటలోళ్ళీ-నమ్మి గెలిపినాడయ్యా, యింకొకడు!

ఓయ్. వోడిపోడేటివోయ్. ధరలు తారాజువ్వలు జేసీసి, కరెంటు తివ్వలు షాకు లిచ్చీసి, కంపినీలు మూయించీసి, వుజ్జోగాలు వూడగొట్టేసి-రైతుల్ని, కార్మికోల్ని, ఉజ్జోగస్తుల్ని-ఉచ్చబోయించీస్తే వోడి పోడేటివోయ్?

ప్రెపంచ బేంకీ-యేటి, ఓట్లడుగుతాదా? ఓట్లెయ్యించుతాదా? రిగ్గింగయినా-సెయ్యించగల్దా?

ఔనుగానీ; అసలకి యివతలోడు ఎండా వోనలనక జనం మధ్యన తిరిగి నాడువయ్యా. ఇందిరమ్మ రాజ్జెమొస్తందన్నాడు వోయ్. అప్పులెగ్గొట్టీమన్నాడు వోయ్! బిల్లులు చింపీమన్నాడు వోయ్! యివతల జనానికి-నోటిలోని కోరిక-నోటిలోన వుంటుండగానే; అవతల అతగాను వోగ్దానం జేస్సీవోడు వోయ్! మరి గెలడేటి వోయ్...?

గెలిచినాడుగానీ, ప్రపంచ బేంకు కన్నెర్ర చేస్తందట కదా -ఆ వోడిపోయినోడి మీద అన్నలు కన్నెర్ర జేసినట్టు...?

అని, సంశయాన్ని ప్రకటించుకుని, కాసేపు మౌనంలో వుండి, మళ్ళీ-సంభాషణ లోకి దిగేరు.

అతగానే గెలిసుంటే బాగుండున్నేమో! అన్నల పని-పట్టీసి వుండున్నేమో...? ఎంత పనయిపోయింది...? ఛఛా....!

ఎవుడోయ్ చెప్పేడు? ఇలాటి ముఖ్యమయిన విషయాలకి-శాంతి, బద్రతలకి సంబంధించి -ఎలక్షనేటివోయ్...?

ఎలక్సనంటేటి-మాట్లేటివోయ్. కోట్లు మంది ఓటర్లు. కోటి విధాలుగా, కోటి బూతుల్లోన, పాములాదిలినట్లు వాదుల్తారు ఓట్లు. ఎవుడికేది శాంతి? ఏది బద్రతో...? ఎవుడిష్టం ఆడిది...? ఎవుడి ఓటు-ఆడిదీ....!

సెసే, యిలాంటిసయాలకి-ఫోర్స్ దించేసి, పనిబట్టీ యాలవయ్యా. ఎలక్సనూ, వార్...రొండంచుల కత్తివోయ్ రాచకీయానికి.

అయిదూళ్లడిగేరు. ఇవ్వం, పొమ్మన్నారు కౌరువులు! ఎలక్సనే యెడితే పాండవులు గెలుద్దురేటి రాజ్జెన్ని...?

అంత తెలివయినోడు, పెపంచబేంకు మెప్పు పొందినోడు-యేఁవి యిలాటి స్టెప్స్ యేస్సాడు...ఏఁవి?

అదలాగొదిలీవోయ్. ఓడిపోయినోడి వూసాదిలీ.గానీ, గెలిసినోడికి పెపంచబేంకు ఎగినిస్టా? అప్పు, సప్పు యివ్వదా? ఇతగాను యిన్నన్ని వోగ్దానాలు సేస్నాడా! అవన్నెలాగ నెరువేరుస్తాడువయ్యా...?

అంచేతనేమోనోయ్...అటు పెపంచ బేంకికీ యెగినిస్టయిపోయీ, యిటు అన్నలకీ యెగినిస్టయిపోయీ; ప్రతిపక్షంవూ సొంతపక్షంవూ యెలగూ యెగినిస్టే-యిన్ని యెగినిస్టుల్తోటి యెన్నాళ్లు ఏలుబడిలో వుండగలనని గావాలవోయ్-ముందు అన్నల్తోటి కయ్యంగాదు-నెయ్యమంటన్నాడు. ఈడూ-తెలివయినోడేని వోయ్.

యిలాగ చూస్తే- యితగాను, తరాత మెల్లిమెల్లిగా ప్రపంచ బేంకినిగూడా మచ్చిక చేసుకునీవోడులాగే వుందోయ్. ఏటుంది కష్టం? అళ్లు సెప్పినట్టు-కొన్ని పన్లు చేసీడిమే, కదేటి? సపోజు-అళ్లు-రొండు బల్బులకి ఫ్రీ కరెంటు యివ్వొద్దన్నారనుకో. యితగాను-చిత్తం, అలగలగే అని అళ్లకాడ వొప్పీసుకొని; వొక్కబల్బుకే ఉచితమనీడంవే గదా? ఇతగానూ తెలివయినోడేనోయ్.

అతగాని తెలివితేటలయినా, యితగాని తెలివితేటలయినా- మనకి పనికిరావాల, ఆడిక పనికి రావాల! అంతేనివోయ్. పనికొస్తే 'జై" అంటాంవు, లేపోతే-'నై' అంటాంవు. అంతేగాని, అతగాని పక్క కొందరం, యితగాని పక్క కొందరం నిలబడిపోయి- మనం, మనం కలబడి పోయి కొట్టుకుంటామేటివోయ్? కొట్టుకుంతే-మనం, మనం నష్టపోతాం!

ఓస్సే- మీదని అళ్లకే అంత తెలివి తేటలుంతే- కిందని మనకీ ఆపాటి తెలివి తేటలుండవా? ఉండబట్టే గదా- మొన్నటి మండలెలెక్షన్ల - మన రాంవినాయుడ్ని - మనం గెలిపించుకున్నాం! లేకపోతే - ఎంపీపీ పదవి- ఆ సంగం నా కొడుకులు కొట్టేసుందురు. నంజికొడుకులు...! ట్టిపా గాడి చేతిల- రాంవినాయుడు వోడిపోతే - యెంత అప్రదెష్ట! ఛిఛీ....

అని, ఆ విధంగా రాష్ట్ర రాజకీయాల్ని ముగించుకొని, సంగం దగ్గరకీ వొచ్చి-చీదరించుకొని - కాసేపు మౌనంగా కూచున్నారు.

రుక్మిణమ్మ భర్తకు- కేంద్ర, రాష్ట్ర రాజకీయాల ముచ్చట్ల కంటే- స్థానిక రాజకీయాల్ని- ముచ్చటించుకోటం మాత్రమే కాదు, తమ లబ్ధి కనుకూలంగా- యెలా మలుపులు దిప్ప వీలవుతుందో - చర్చించుకుంటే బాగుండునని వుంది! గానీ ఆయనకూ-వొక చిత్రపటం లాగా రూపుదిద్దుకోవటం లేదు. స్థానికులా- వాళ్ల చూపు మండలాన్ని దాటినా, జిల్లాని మించిపోదు. గానీ, ప్రత్యర్థులా- అలాలేరు. జిల్లాలూ, రాష్ట్రాలేంమిటి దేశాలను దాటి ప్రసరించే ప్రపంచదృష్టి వాళ్లది! ఏం చెయ్యటం...? ఇంతవరకూ యేం చేసినాం?

పశులకాపర్ల సమ్మె నుండీ- నిన్నా, మొన్న జరిగిన 'జన్ని పాలం' గొడవ వరకూ-తనూ, యీ స్థానికులూ, తమ చౌదర్లూ- యేమేమి చేసారో. గుర్తుకు తెచ్చుకున్నాడు.

కొట్లాటలూ, కేసులూ, హత్యలూ, పంటల విధ్వంసాలూ, గృహదహనాలూ- వీటిలో తాము గెలిచింది యెంత? వాళ్లు ఓడింది ఎంత...? వాళ్లసలు- ఓడినారా ఓడినందుకు ... కుమిలినారా? అసలు- వాళ్లు ఓడినందుకు పోయేదేఁవిటి? యేముంది- వాళ్లన్నట్లు - సంకెళ్లా...?

రుక్మిణమ్మ భర్తకు- ఆ తర్వాత మరి ఆలోచించటానికేమీ అందటంలేదు. నిన్న కోర్టు వాయిదాకి వెళ్లొచ్చినప్పటికి నుంచీ - యేం చెయ్యటం అన్న ప్రశ్న వద్దనే వుండి పోతున్నాయతని ఆలోచనలు. జన్నిపాలెం మర్డర్ కేసు- తీర్పు వొచ్చే వొచ్చట. వొకవేళ శిక్షలుపడినా- హైకోర్ట్‌లో పోతాది భయపడొద్దు-గానీ, యెందుకీ కేసులూ, కోర్టులూ...? అక్కడ 'వాళ్ల'తో వొక పరిష్కారానికి రాగూడదూ- అన్నాడు వకీలు. అదే, మంచిదోయ్- బావా అన్నాడు హరిప్రసాద్.

ఇప్పటి వరకూ కొంత మంచే జరిగింది. చవుకగా భూఁవులు దొరికేయి. పనికి కూలీలూ, కంబార్లూ- చవుకగానే దొరికేరు. యేటకేటా - యెంతో కొంత మిగులు ధనం చేరతానే వుంది. యెంతో కొంత భూఁవి - కొంటానే వున్నాం.

అక్కడే వొచ్చింది! భూఁవి దగ్గరే వొచ్చింది! అదే కీలకమైంది! కూలి రేట్ల వద్దా, జీతనాతాల వద్దా మంచీ చెడు మాటల వద్దా- వొచ్చిన గొడవలన్నీ.... అటూ యిటూ.....రాజీలతో ముగిసిపోయీవి! గానీ, భూమి దగ్గరే.... గొడవ కాదది- ఘర్షణ...! ముగింపు రావటం లేదు.

యేం చేద్దాం? మళ్లీ ఆ ప్రశ్న దగ్గర ఆగిపోయేడాయన. కానీ, ఆ ప్రశ్న మాత్రం- మనసులో మాత్రమే గాక- బయటకు విన్పించేడు.

"..యెప్పుడూ, యేటి జేస్తున్నాఁవో, యిప్పుడూ అదే చేస్తాం. అడివిల కలపని అడ్డితే- యేటి జేసాం? పాండోళ్ల వొంట సారాని అడ్డితే యేటి జేసాం? సంతల్లోన యాపారాల్ని అడ్డితే యేటిజేసాం? యేటి, సంగమేటి గవర్మెంటండీ? స్మాగ్లింగూ, దొంగసారా, దొంగ యాపారఁవూ- అనడానికీ? అడ్డడానికీ? భూఁవులకాడా, యాపా రాల కాడ, ఎలక్షన్ల కాడ- ఈళ్లెవులండీ- మనల్నడ్డడానికి? గవర్మెంటండీ..?

గవర్మెంట్‌కి సెప్పుకోమనండి. అడ్డమని సెప్పుకోమనండి. అరికట్టమని సెప్పుకో మనండి. గవర్మెంటూ, మనఁవూ సూసు కుంతాఁవు! అంతే! అఁ! ఈళ్లెవులండీ? సంగమేటి గవర్మెంటండీ?

లేదంతారూ- ఎలక్షన్ల గెల్సుకోమనండి. గవర్మెంటుని మార్చుకోమనండి. అప్పుడు మాటాడమనండి. అప్పుడాలో సిద్దుఁవు - యేటి సెయ్యాలో!

అంతవరదాకా- నిన్నా, మొన్నా యేటి జేసాఁవో యీ పొద్దూ, రేపూ అదే జేస్తాం! అంతే..." అని, దేహాన్నంతట్నీ ఊపుతూ, తేల్చి చెప్పాడు కురిమినాయుడు.

బాయులన్నా, ఎంపీపీ రామినాయుడూ- అంతేమరి - అన్నట్టుగా మౌనాంగీకారాన్ని తెలిపేరు. చౌదర్లు- మరో మార్గం యేదీ అన్నట్టు చూసేరు.

రుక్మిణమ్మ భర్త- కురిమినాయుడు మాటల్నే- మళ్లీ, మళ్లీ తలచుకొని - విశ్లేషించుకోసాగేడు.

కలప స్మగ్లింగూ, దొంగసారా, దొంగ వ్యాపారాలూ- వాటిని గదా- అడ్డుతోంది సంగం అనుకున్నాడు తను. వొచ్చిన తొలి నాళ్లలో- అంచేతనే తటస్థంగా వున్నాడు. గానీ యెన్నాళ్లు...?

సంగం- అక్కడికి ఆగిందా? కూలిరేట్లు, పాలేర్ల జీతాలు, పశులకాపర్ల వేతనాలు- మాటాడినారు. పోట్లాడినారు, పెంచమని! సరేపోనీ.... అనుకున్నా! వ్యాపారపంటలు కాదు ఆహారపంటలే పండించమంటారా? ఆహార పంటల్లో కొంతభాగం లెవీ ధరలకి సగం గ్రామాల్లో అమ్మమంటారా? వాళ్ల సంగం వున్నాదని - నాకు లబ్ధి కలిగే పంటల్ని పండించక, నాకు లబ్ధి గలిగే మార్కెట్లో అమ్ముకోక - చెడిపోవాలా...నేను?

అప్పుడు గదా- తటస్తంగా వుండలేనని తెలిపోయింది. సరిగ్గా, అలాంటి సందర్భం- 'జన్ని పొలం' సమస్య అయ్యింది. ఘర్షణ ముదిరిపోయింది....!

రుక్మిణమ్మ భర్త, యింకా విశ్లేషణలో నుంటుండగా- రామినాయుడు కంఠం చించుకొని-

"...వొదిలీసెళిపోతే- యెళిపొండి. యెళి పోగల్రు మీరు. యెక్కడ్నుండో వొచ్చేరు, మరెక్కడికో యెళిపోయినా యెళిపొగల్రు. ఇక్కడ దొరికినకాడకి- ముక్కున చిక్కించుకున్నారు. ఇక, యెళిపోవాలనుకుంతే- యెళిపోగల్రు. యెళిపొండి. మేఁవు యెళ్లం. మేఁవొదలం. అఁ..."అని, నిర్ణయాన్ని ప్రకటించి లేచేడు.

అతనితోపాటూ, బాయలన్నా కూర్మి నాయుడూ లేచేరని; చౌదర్లూ లేచేరు. సరిగ్గా, అప్పుడు చేరింది రుక్మిణమ్మ!

వాళ్లంతా- రుక్మిణమ్మతో గూడా - వొస్తామమ్మా- అని చెప్పి, వెళిపోయేరు.

భార్యా, భర్త లిరువురూ- కొంతసేపు మౌనంగా కూచున్నారు. కాసేపటికి రుక్మిణమ్మే ప్రశ్నించింది.

"..యేఁవంటారు, వీళ్లంతా?" అని.

రుక్మిణమ్మ భర్త - మళ్లీ తాము సాగించిన సంభాషణనంతట్నీ పునశ్చరణ చేసుకొని-

"....మళ్లీ దాడి చేద్దామంటారు..." అని చెప్పేడు

"...వాళ్లు యెదురుదాడి చెయ్యరేంటి...?" అని ప్రశ్నించి; ఆలోచనలో పడింది.

కిందటిసారి- వీళ్లమాట వినే- దాడికి దిగటం, మైదాన గ్రామాల నించి నాయుళ్లు తమ చేతి కింది మనుషుల్ని సాయం తేవటం, ట్రాక్టర్లూ, కర్రలూ, కత్తులూ, కొడవళ్లతో- 'జన్ని పొలం' పంట కోసుకు పోటానికి పూనుకోవటం....!

ఐతే - యేం జరిగింది.

వాళ్ల ఎదురుదాడి జేసారు. కొండల్నించి, వలసల్నించి, గూడేల నుంచి- ఆడా, మగా, పిల్లా పిచ్చుకా....! వడిసేలలు, రాళ్లు, కర్రలు, కత్తులుతో!

ఏఁవైంది...? ట్రాక్టర్లు ధ్వంసం, నాయుళ్ల బలగం కాళ్లకు బుద్ధి చెప్పడం, తామే- యిళ్ల తలుపులు మూసి దాక్కో వటం! వాళ్లు పంట కోసుకుపోవటం....! పోలీసు బలగం రావటం.... ఘర్షణ ఆపటం!

గానీ- యెలా జరిగిందో వాళ్ల మనిషి చనిపోయేడు. హత్యకేసొకటి- నడుస్తోంది తమమీద...! ఆ కేసు పోతుందన్నారు- లాయర్లు.

నిజఁవే! గానీ, భూమి రాలేదుగా?

అయిదేళ్లయ్యింది. వాళ్లే... ఆ భూమిని ఉమ్మడి ఆస్తి జేస్నారు. సమిష్టి సాగు చేస్తున్నారు. జన్నిపాలెం- భూమేగాదు, ఆనాటి దాడి తర్వాతే- వాళ్లు వివాదంలో వున్న భూఁవులన్నిటీ - ఉమ్మడి ఆస్తులుగా, సమిష్టి సాగు చేస్తున్నారు. కోర్టులూ, జైల్లూ, యిల్లూ పొలాల్లాగా- అలవాటుపడిపోయేరు వాళ్లు!

"...వాళ్లేఁవిటో, వాళ్ల బాట యేఁవిటో బోధపట్టంలేదు. వాళ్ల మనిషి చావుకి- ప్రతీకారంగా - యివతల మీ వాళ్ల నెవర్నో చంపుతారనీ, యిక ఆ తర్వాత, వాళ్లంతా ఆ బాటలో నడుస్తారనీ- చూసేం. తుపాకులు సిద్ధం చేసుకు చూసేం- వ్చ్. వాళ్లేఁవిటో బోధపడ్లేదు.

కొందరు లీడర్లు అజ్ఞాతం లుంటారు. కొందరు బహిరంగం! మళ్లీ...ఎన్నికల్లో పోటీ అంటారు. ఏఁవిటో - యెత్తుకి పై యెత్తు లేసి- వాళ్లు నడుస్తున్నారు...." అని, పోలీసు అధికారి వొకాయన, చెప్పిన మాటలూ, అప్పుడు తను బేలగా చూస్తుంటే - ఆయనే-

"...అయినా అమురుతారు! యెక్కడి కెళ్తారు? ఇదేటి- యెవులి రాజ్యెం? ఆళ్లేటనుకుంతంద్రంటే- దొంగసారాని అరికట్టడం, దొంగ యాపారాల్ని అడ్డటం, భూఁవిలేనోడికి భూఁవులివ్వటం, ధనికా, బీదా తేడాల్లేకండా- చట్టం అమలు జెయ్యడిం ఇలాంటివన్నీ రాజ్యాంగల వున్నాయి గదా? అట్నీ అమలు జెయ్యించడంకి- యీ ఆఫీసులూ, కోర్టులూ, పార్లమెంటసంబ్లీలూ చాలనా? ఈటికే ఆయుధాలు పట్టేసి, అడివిలు బట్టీడమేలా? అనసుకుంతన్రు...! అదమ్మా సంగతి....! అనుకోనియ్యి! గానీ, రాజ్యె మెవుల్దీ...? అని ఆగాడాయన.

"...రాజ్యాంగం వల్ల మనకిబ్బందులున్నట్టే వుందన్నమాట...." అని గ్రహించి, అదేం రాజ్యాంగం సామీ, అలాంటిదాన్ని మార్చేసి పొయ్యుంటే- సరిపొయ్యేదిగదా- యెవురన్నా అనుకుంది తను! అది గ్రహించే, ఆ అధికారి -

"...తస్సాదియ్యా- అళ్లు రాజ్యాంగాన్ని తిరగరాస్తామంటిన్రు. అదాళ్ల వొశిమేటి? ఇక్కడ, పార్లమెంటసంబ్లీల్ల వశంగాదు, అడివిల్లంట అసలుకి వొశంగాదు. ఏం పర్లేదమ్మా... అమూర్తారమూర్తారు..." అని, ఆయన యిచ్చిన హామీ గుర్తొచ్చింది.

గానీ, రుక్మిణమ్మకు ఆ పోలీసు అధికారిచ్చిన భరోసా గూడా- మనస్థిమితాన్ని యివ్వలేదు. ఆలోచనల్లోంచి తేరుకొని

"లాభం లేదండీ...." అంది.

భర్త గూడా- ఔనన్నాడు

"...యేం చేస్తాం?" అనడిగింది.

"....ఐటిడిఎ- పీవో గారి క్కూడా చెప్పాం. చూద్దాం. ఔనూ ఆ ట్టిపా గాడేం వంటాడు? ఆడ్ని వొంచితే... చాల్ను. మనం తేలిపోవచ్చు..." అన్నాడు భర్త.

"ఆడా..? కాద్రు...! అది కంటే - వాళ్ల లీడరు చంద్రన్నని పట్టుకోవటం సులువేమో..!"

"...కొమ్మనే వొంచలేవు- మొదలు మీద దృష్టిపెడ్తావు నువ్వు..." అని విసుక్కున్నాడు భర్త.

రుక్మిణమ్మ, ఆ విసుగుదలని గమనించలేదు. ఆమె మనసులో - పీవో గారి ఆఫీసుకి వెళ్లన ట్టిపా, నీలగాడూ, రూల్సు గాడూ కదలాడేరు. ఈసరికి ధర్నా సాగుతుండి వుంటాదనుకుందామె. పీ.వో యేం చెప్తాడో...?

★★★

ట్టిపా- హడావిడిగా తిరిగేస్తున్నాడు. జనాలు షామియానా నిండుగా చేరు కున్నారు. ఇంకా వస్తూనే వున్నారు.

ఉదయం పదిగంటలు- దాటబోతుంది సమయం. పీ.వో.గారి ఆఫీసు ఉద్యోగులు - చేరుతున్నారు. షామియానాలోని జన సందోహాన్ని చూసి- అప్పుడే తెల్లారి పోయిందా- వీళ్లకి అని, సాణుక్కుంటూ లోనకి వెళ్తున్నారు. వాళ్లు- మబ్బుల ఆకాశంలోంచి- బయటపడిన సూర్యుని కిరణాల్లా - బద్ధకంగా వున్నారింకా!

గానీ, జనసందోహానికి ముందరే - యిద్దరు పోలీసులు మాత్రం- ఆకాశంలోని - రే చుక్కా, పగటిచుక్కల్లా- బందోబస్తుకి వొచ్చేసారు.

"...అదిగో దుగ్గేరు కొండా..." పాట యెత్తుకుంది పార్వతి. వంతలు అందుకున్నారు. ఒక పోరాటోద్వేగ గానం... అక్కడి పర్యావరణాన్నంతట్నీ ఊపింది.

కాసేపటికి- పీ.వో.గారి కారొచ్చింది. తిన్నగా వొచ్చి, ఆఫీసు మెట్ల వద్ద ఆగింది. మెట్లు లెక్కించుకు- లోనకి వెళిపోయేరు పీవోగారు కారుదిగి!

పార్వతి మరోపాట యెత్తుకుంది- "శ్రీకాకుళంరా... వీర శ్రీకాకుళంరా..." పాట సగంలో వుండగా-

"....అలాంటి పాటలేటి-పాడొద్దు. బాగోదు..." రేచుక్క అభ్యంతరాన్ని తెల్పింది, పార్వతి బృందాపికి.

పార్వతి పాట ఆపలేదు.

తర్వాత పగటిచుక్క గూడా వచ్చింది. కాస్తా స్వరం పెంచి-

"యేఁవలగ? అలాంటి పాటలు పాడొద్దంటే వినరేం? ఆపండాపండి" అని, శరీరాన్నంతటినీ వూపి, చెప్పింది.

అప్పటికి - పాట పూర్తయ్యింది.

షామియానాలో, ముందువరుసలో కూర్చున్న- జన్ని ముత్యాలమ్మ లేచి, వొంగిన నడుముని సాగదీసుకొని, ఆ తర్వాత పార్వతితో

"...ఒలమ్మీ, పార్వోతీ! ఔనే అలాటివేటే పాడ్తావు? వోనొచ్చిందంతే- వొరదస్తదీ, వొరదొచ్చిందంతే- దురదొస్తదీ..." అని అభినయించి, పాడి వినిపించి-

"....యిలాంటివి పాడే- బాబు గోక్కుంతాడు..." అని చెప్పింది.

షామియానాలోని- సమూహమంతా - గొల్లున నవ్వింది.

రేచుక్కా పగటి చుక్కలకు - టోపీలు తీసేసినట్లయ్యింది.

అందికే- యీ నంజల్నీ, నంజికొడుకుల్నీ - నాటి కర్రలిరిగినట్టగ కొట్టాలన్పిస్తాది. ముసిలి నంజ కూతురికి - సూడెంత యెటకారఁవో? ఉండుండి. రానీయండి. రానీయండి- మా ఫోర్స్ మొత్తం రానీయండి. మా తిక్కలోడు- సీఐ తొంగొని లెగలేదుగావాల, ఆడు రానీయండి. అప్పుడు సెప్తాం. ఆడెలాగూ వొక ముక్కే సెప్తాడు- ఎఁవికలిరగ్గొట్టి, యేనెక్కించండిరా నంజికొడుకుల్ని- అనే సెప్తాడు.

అప్పుడు పాడుదురు- ఈర శికాకుళంరా, గీరా శికాకులంరా అని! ఏటే- ముసిలీ, వొరదొస్తే దురదొస్తాదే? డేన్సాడ్తావా? వుండుండే- నీ గుండార యిప్పించి, నీ సేత డేన్సాడిపిస్తాం, వుండుండే- అని, ఆవిధంగా, వారి భంగ పాటుకి తగిన ప్రతీకారం- మరి కాసేపట్లో తీర్చుకుంటాము సుమా అన్నట్టు గుర్రుగా, క్రోధంగా చూసేరు ఆ యిద్దరు రక్షకభటులూ!

"...యేం బావూ? యేటలగ ఎర్రగించి సూత్తావు; నీనేటి తప్పుమాట అన్నానా? జెవాను బాబు సరదాపడతండు, సరదాపాటలో దురద పాటలో పాడే పార్వోతీ అన్నాను. తప్మాటా బావూ...? ఏఁవలగ మింగేసేట్టగా సూత్తావు?" అని జన్ని ముత్యాలమ్మ- చూపుల పోలీసుల్లో వొకణ్ణి ప్రశ్నించింది.

పోలీసువారు చూపులు మరల్చి లాఠీలను వోసారి యెత్తీ, దించీ చూసుకున్నారు.

"ఓసేటీ తప్మాట అన్నాను? నాటీ కఱ్ఱలెత్తి దించుతారేటీ? యేటి, కొట్టీడానికే? కొట్టిడానికే! యేటి, కొట్టీడానికే...?

ఆగండాగండి. కొడుదురాగండి. ఆగండి., కొట్టడమేటి మీకు కొత్తా? కాయడంగానీ మాకు కొత్తా? అగండాగండి. అందర్ని రానివ్వండి. అసర్ల యేళ అవనియ్యండి. అప్పుడెలగా - మీరు సేసీపని అదేగదా.." అని ఆ రక్షక భటులకు చెప్పి, తర్వాత, సమూహానికి యెదురుగా నిల్చొని-

"..వోర్రె మనోళ్లో... అందర్రీగుండఱ్రా. అసర్ల యేళ అయిపోయివొచ్చిందట. ఘటాలు దిగిపోతాయట. కాస్కోండి....." అని చెప్పింది.

సమూహం గొల్లుమంది. పోలీసులకామె మాటలు బోధపడలేదు. అప్పుడే- ఆదెయ్య ధర్నా కార్యక్రమాన్ని అరం భించేడు. తమ డిమాండ్లను సమూహానికి వివరించేడు. కొన్ని ప్రజాసంఘాల ప్రతినిధులు - ధర్నాకు మద్దతు తెలుపుతూ మాటాడేరు.

డిమాండ్ల నినాదాలు ఆరంభించేరు.

పాటలూ, ప్రసంగాలూ, నినాదాలూ... కొనసాగుతున్నాయి.

"...ఔనొరే ట్టిపా- పీవోకి మన గోల యినబడతాదా? అతగాడిది ఏసీ రూము గావాల్రా?" అనడిగేడు నీలడు.

ట్టిపా- అసహనంగా చూసేడు.

"రూల్సు పెకారం - పెల్లికారుడిచ్చి, చెప్పి, వొచ్చినాం గాబట్టి- పీవో.. వొచ్చి, పలకరించాల మనల్ని..." అన్నాడు రూల్సుగాడు.

"....అవిగో,ఘటాలు దిగిపోతన్నాయి. అవి పలకరిస్తాయి.. కాసుకోండిరా.." అని, వేనుల్లోంచి దిగుతోన్న స్పెషల్ పోలీసు బలగాన్ని చూపేడు ట్టిపా.

"...వోస్సీ, రూలుసు పెకారం లోటీసిచ్చి దర్నా జేసినా, దండు దిగిపోతాది యెపుడున్నూ! మళ్లీ దరువులు కాసీడమేనా? ధర్నా నాడు- వొంటికి మత్తుగ ఆఁవదం రాసుకోవాల. బనీను మీద బనీనూ, సొక్కా మీద సొక్కా యేసిసుకోవాల... యిక ముందు.." అని భద్రతా చర్యలు తలపోసేడు రూల్సుగాడు.

వేనుల్లోంచి దిగిన స్పెషల్ పోలీసులు- షామియానా చుట్టూ- దడదడ దడా మంటూ వొచ్చి నిల్చున్నారు. ఏక్షణాన్నయినా - దండనకు సిద్ధంగా నిల్చున్నారు. రేచుక్కా పగటి చుక్కలు- లాఠీలను ప్రేమగా దువ్వుకుంటూ - పార్వతి బృందానికీ, జన్ని ముసిలిదానికీ దగ్గరగా నిల్చున్నాయి.

వేనుతో పాటే వొచ్చిన జీపులోంచి - సీఐ గారు దిగి, టోపీ మీదుగా కళ్లమీద పడే సూర్యకిరణాలకు చిరాగ్గా అరచేయి అడ్డుపెట్టుకొని, షామియానా వేపు నడిచేరు.

కొందరు పోలీసులు ఆయనను అనుసరించేరు. ఆయన- ఆదెయ్య దగ్గరకొచ్చి - నినాదాలూ, పాటా, మాటా ఆపేసి, మెమొరాండం పీవోగారికి యిచ్చేసి వెలి పొండివోయ్- అని చెప్పేరు.

"మెమొరాండం యివ్వడానికే అయితే- యింతమందిమి, యిన్ని పుర్రాకులు పడి, యింత దూరం రావడమేల? పోస్టుడబ్బాల పడిస్తే- పీవోకి అందదేటి? పీవో- యేటి , అడ్రసు లేనోడేటి?" అన్నాడు ట్టిపా.

సి.ఐ. ఎర్రగించి చూసేడు.

"....అదిగాద్సార్. మెమొరాండమెలాగూ యిస్తాం. ఆ యిచ్చీపుచ్చుకోడాలు, జనం ముందు జరగాల. శిబిరంలోన జరగాలి. పీవోగోరు శిబిరంకి.... వొచ్చి నాలుగు ముక్కలు మాటాడాల...సార్..." అన్నాడు ఆదెయ్య.

"ఔనుగదా... రూల్సుగదా... పీవో రావాల గదా...." అని రూల్సుగాడు వక్కాణించేడు.

సి.ఐ. వోసారి షామియానా అంతట్నీ పరికించేడు. అర్థనగ్న దేహాల్తో- ప్రాణమున్న విగ్రహాల్లా కన్పించేరంతా.

"మీ మాట ప్రకారం - మీఁవు నడుచుకోవాలా?" కోపగించేరు సిఐ గారు.

ఎవరూ బదులు పలకలేదు.

"మీ దగ్గరకు- పీ.వో.గారే దిగిరావాలా?"

ఎవరూ బదులు...

"మెమొరాండం యిచ్చి- వెళిపోతారా? లేదా?"

ఎవ్వరూ....

"పలకరేఁవిరా...?"

..............................

మౌన తిరస్కారాన్ని సహించలేక పోతున్నాడు సి.ఐ. ఆయనకంటే; రేచుక్కా, పగటిచుక్క జవానులు - మరింత అసహనంతో, లోలోపల గింజుకుంటూ, చిరాగ్గా సిఐ వేపు చూస్తూ - యెంతసేపిలగ, యెదవ కొశ్మిన్లేస్తావు? దర్నా కొచ్చినోళ్లు దరువులు కాయడానికి సిద్దమయే వొస్తారు. దరు వెయ్యాలంటే- ఏసెయ్. ఆర్డరేసెయ్- దండుకి దండు సిద్ధంగుంది. లేదంతావా- ఈళ్లని ధర్నా చేసుకోనియ్. అరుసుకోనియ్. ఈళ్ల అరుపులకి ఆ ఆఫీసర్నంజి కొడుకు దిగుతాడు. దిగప్పోతే- యీ నంజికొడుకులు దించుతారు! ఈళ్లూ, ఆడూ తేల్చుకుంతారు. వొదిలీయ్. అంతే! ఏదోవొకటి సెయ్...! అంతేగాని, యెదవ కొశ్చిన్లేటిరా తిక్కనా కొడకా? - అని మనసులో తిట్టుకోసాగారు.

సి.ఐ.గారు జవాన్ల వేపు చూసేరు. వారు, గభాల్న చూపులు మరల్చుకున్నారు. అప్పుడు చివరికి-

"...సరే, నిశ్శబ్దంగా వుండండి. పీ.వో. గార్ని కనుక్కొని వస్తాను..." అని, సి.ఐ గారు వెళ్లేరు.

"పీ.వో. రావాలి- రావాలి...' అరిచేడు ట్టిపా.

అందరూ, మళ్లీ నినాదాలు యెత్తు కున్నారు.

"ఒరే. నిశ్శబ్దంగా వుండమన్నాడ్రా సి.ఐ. గాడు. కనుక్కొనొస్తాడు గదా, యేలరా సోగనెత్తుకున్నావు?" పొడిచేడు ట్టిపాని రూల్పుగాడు.

"..రూలుసు పెకారం - యిప్లవం నడుదురా..." బదులిచ్చేడు ట్టిపా.

ఈలోగా, పత్రికా విలేకర్లు కొందరొచ్చేరు. ఫొటోలు తీసేరు. ఆదెయ్య అందిచ్చిన మెమొరాండం కాపీలు - తీసుకున్నారు.

వారిలో వొక విలేకరి - ట్టిపాని గురించిన భోగట్టా గుర్తు జూసుకుంటూ, ట్టిపా దగ్గరకు వొచ్చి-

"...నువ్వే గదూ ఆరిక శుక్రూ? జన్ని పాలం- నీదేగదూ? ఆనాటి గొడవతో, భూమిని మీకు అప్పజెప్తుంది ప్రభుత్వం అనుకున్నాను. లేదా, మీరు భూమికి దండం పెట్టి- వొదులు కుంటారను కున్నాను. రెండిట్లో - యేదీ జరగలేదన్న మాట....?" అనడిగేడు.

ఆ విలేకరే- జన్ని పాలం భూసమస్య నేపథ్యంలో ఏజెన్సీలో జరిగే- భూమి భాగోతాన్ని సీరియల్‌గా నాలుగైదు రోజులు రాసేడు.

గిరిజనోద్యమం అణచివేయబడినాక, ఎమర్జెన్సీరాక, పోకా- ఆ తర్వాత కాలంలోనా- గిరిజన ప్రాంతమూ, దాన్ని అనుకుని వున్న మైదానమూ, దానితో సంధానమైన పట్టణ, నగర ప్రాంతాల్లో - అనేక మార్పులు జరిగేయి.

గిరిజన ప్రాంతంలోకి- రకరకాల సంక్షేమ పథకాలు, కాలనీలు, ఆశ్రమ పాఠశాలలు, రోడ్లూ, చెక్‌డ్యామ్‌లూ, అడవుల పెంపకాలు, మల్బరీ తోటలూ, జీడి, నీలగిరి తోటలూ - కొత్తకొత్త కాంట్రాక్టర్లు, యివన్నీగాక- కళింగాంధ్రేతర జిల్లాల నుండి - పెట్టుబడులు ట్రాక్టర్లు, మార్కెట్లు.. వొచ్చి చేరేయి.

ఆకుపచ్చని అరణ్యం కన్పించేది- బాహ్య ప్రపంచానికి. దాని, రక్తసిక్తగతం, దాని దాస్యగతం, దగ్ధగతం- గతః అనుకున్నారు. గానీ, ఆకుపచ్చని అరణ్యంలో పాత బాధలే, పాత బాధితులూ వున్నారనీ; బాధించే రూపాలూ, బాధించే శక్తులూ కొత్తవనీ- గనక, మళ్లీ అరణ్యం అంటుకుంటుందనీ- రాసాడాయన!

అదంతట్నీ గుర్తుకు తెచ్చుకుని-

"...యింతకీ, 'జన్ని పాలం' యెవరి స్వాధీనంలో వుంది?" అని ప్రశ్నించేడాయన.

"....భూఁవి మా సోధీనంల వుంతే గదా- మీకు 'వార్త' అవుతాది! ఆళ్ల సోధీనంల వుంతే- వార్త అవుతాదేటి మీకు..." బదు లిచ్చేడు ట్టిపా.

ఆ జవాబులో - యెత్తిపొడుపు అర్థ మయ్యిందా విలేఖరికి. ఏదో బదులు చెప్పబోతుంటే- సి.ఐ. వొచ్చేరు.

"....పీ.వోగారు ముందు నాయకుల్తో మాట్లాడుతారట. ఆ తర్వాత, జనంతో మాటాడ్తారంట. ఎవరో- ముగ్గురు లీడర్లు రండి..." అని చెప్పేరు.

వెళ్దమూ, మానెద్దామా అని కాసేపు తర్జన భర్జనపడి - చివరికి ముగ్గురు వెళ్లాలని నిర్ణయిం తీసుకున్నారు. నీనొస్తానంది- జన్ని ముసల్ది.

నువ్వు రారా- అని ట్టిపాని పిల్చేడు ఆదెయ్య.

★★★

పీ.వోగారి రూములో ఆయనతోపాటూ, డీ.టీ.డబ్యూ.వో (డిస్ట్రిక్ట్ ట్రైబుల్ వెల్ఫేర్ ఆఫీసర్), ఆఫీస్ మేనేజరూ కూచున్నారు.

ఆదెయ్యతో పాటూ వొచ్చిన లీడర్లను చూసి - పీవోగారు ఆశ్చర్యపోయేరు. ఓ ముసల్దీ, వో వామనడూ, వో అర్భకుడూ- మీరేనా లీడర్లు!? అయ్యో పాపం - వీరు ... ఐఎఎస్ల్తోటి, ఐపీఎస్ల్తోటి, ఇండియన్ నేషనల్ పొలిటికల్ పార్టీల్తోటి, ఇండియన్ ఛాంబరాఫ్ కామర్స్ తోటి, యింకా యింకా ఇంటర్నేషనల్ ఎమ్మెన్సీల్తోటి, యింకెందరితో- యింకెన్నిటితో - డీల్ చెయ్యాలి గదా, డిస్కస్ చెయ్యాలగదా, ఢీకొట్టాల గదా.....? పాపం. వీరికి ప్రపంచమంటే - మూడు కొండల మధ్య గల వీరి భూభాగమనుకుంటున్నారేమో!

మీకు బయట విశాల ప్రపంచముందయ్యా. మీ కెదురుగా బలమైన దుర్గమున్నదయ్యా. ఢీకొనలేరయ్యా. ఢీ కొంటే- నెత్తిపగిలి, నెత్తురు గక్కేస్తారయ్యా... అనుకొని, సానుభూతి నిండిన స్వరంతో-

".....పూర్ పీపుల్... విత్ పూర్ విగర్....! ఈజిట్ నాట్...?" అనడిగేరు ఆంగ్లంలో డీటిడబ్ల్యువోని

డి.టీ.డబ్లూ.వో- అలా అనుకోవటం లేదు. పీవోగారంటే- యిటీవలే బదిలీ అయివొచ్చేరుగానీ; యీయన అయిదేళ్లనించీ వున్నాడు. అంతకు ముందర వీరి గురించి విన్నాడు.

ఆ కొండలూ, ఆకుపచ్చని అరణ్యాలూ, ఆ సెలయేళ్లూ, ఆ వలసలూ, ఆ పచ్చిక బయళ్లూ, పశులమందలూ, హరిత సాయంత్రాలూ, శరత్ పూర్ణిమలూ- ఆ పుష్పాలూ, ఫలాలూ, పంటలూ, పంట భూఁవులూ- సంపద్వంత ప్రకృతి గదా- ఆదివాసీ! ప్రకృతి - పేదదెలా అవుతుంది. నేచర్ నెవ్వర్ బికమ్స్ పూర్...! నెవ్వర్ విత్ పూర్ విగర్... గదా!

గానీ వీళ్లు అలా లేరే...?

ఆకులు రాలిన అడవిలా, భీతిల్లి దౌడు తీసే పశుల మందలా, యింకిన సెలయేళ్లలా, గుంకిన వెన్నెలలా, పురుగుల పుష్పాల్లా, చీడలుదిన్న పంటల్లా... యెందుకున్నారు వీళ్లు....? దేనినో, జారిపోనీయ జాలమన్నట్లు ఘోషించే కెరటాల్లా ఎదురు పొద్దులా, ఎందుకున్నారు...?

డీటీడబ్యూవోగారు - మనసు ప్రశ్నల్తో నిండిపోసాగింది.

ఆదెయ్య - మెమొరాండం యిచ్చేడు.

దానినందుకొని, టేబిల్ మీద, పేపర్‌వెయిట్ కింద పెట్టేసి, నవ్వేరు పీ.వోగారు. ఆ తర్వాత, మీ నినాదాలు విన్నాను అనన్నారు.

యినబడితే గదా- నినాదమవతాది- అనుకున్నాడు ట్టిపా.

బాగున్నాయి- అన్నారు పీ.వో.గారు.

శిబిరం కాడకొచ్చి - యిను. ఇంకా బాగుంతాయి- అనుకున్నాడు ట్టిపా.

పీ.వో గారు, జన్ని ముసలమ్మతో-

"....మావమ్మా... సామ్రాజ్యవాదం నశించాలి అనన్నావుగదా- ఆ సామ్రాజ్యవాదమంటే - యేంటమ్మా నాకు అదేఁవిటో, తెలిసి చావటంలేదు..." అనడిగారు.

వొచ్చినపడునించి సూత్తన్నాను. మా సెడ్డ యెటకారంగుంది బావూ నీకు. సామ్రాజ్యవాదమంటే తెలిసి చావడంలేదా? అదేమరి సామ్రాజ్యవాదం- తెలియని చావు- బావూ! ఇంకా పుర్రాగా నీకు బోధపడినట్టగా సెప్పమంతే- మా భూమ్మీ- మీ అపీసెట్ట డఁవే సామ్రాజ్యవాదం- అని చురక లెట్టీద్దునా...! అనుకొని, క్రోధంగా చూసేడు ట్టిపా, ఆదెయ్య కోప్పడ్తాడని జంకుతూ!

జన్ని ముసలమ్మ-

"..కానుగుసెట్టి అడివిల- కాఫీతోట పెరగటం, జునువు గింజల పోడుమీద- నీలగిరి మొక్క లెదగటం, యింటి- పెరటి భూఁవి మీద పనస చెట్టు మాయమయిపోయి - పామాయిలు చెట్టు కొమ్మలిరబోసుకోవడం - నా యింటి ఎన్నుకప్పు మీద- యెక్కడిదో తెల్లకొంగ వాలటం..." అని చెప్పి, అంతేగదర్రా అన్నట్టు ఆదెయ్యవేపూ, ట్టిపా వేపూ చూసింది.

వీళ్లు- పూర్ పీపుల్‌గాక, గీర పీపుల్ అని అనుకున్నారు. అప్పుడు మళ్లీ పీ.వో.గారు-

"సరేగాని ఆదెయ్యా- మీకు అమెరికా మీద ఆగ్రహమెందుకు? ఇరాక్ గురించి మీకెందుకు...? మీ భూమ్మీద వున్న వాళ్లని పొమ్మనండి., అర్థముంది. ప్రపంచంలో - యెక్కడిదో - మీకెందుకయ్యా...?" అనడిగేరు.,

"...మంచిని మంచనమా; చెడుని చెడనమా? మంచీ, చెడులనేవి మా భూ౦వుల మీదనయనా; యీ భూపెపంచ మీ్మద యెక్కడయినా - వొక్కలాగే వుంతాయి గదేటి బావూ...." అని చెప్పేడు ఆదెయ్య.

అపుడు, పీ.వోగారు నవ్వి, మెమొరాండాన్ని తీసి, చూసి,-

"..మొత్తమీ్మద, మీరడగని సమస్య లేదు. ఇరాక్ భూమి మీద నించి అమరికా వెళిపోవాలనటం దగ్గర నుంచి, యిక్కడి మీ వివాద భూ౦వుల నుంచి భూస్వాములు తొలగిపోవటం వరకూ- అన్ని డిమాండ్లూ అడిగేసారు...." అంటూ నవ్వేరు మళ్లీ.

"... అమెరికావోడ్ని యెలాగూ యెళిపోమని సెప్పలేరు. ఇక్కడి, బూసాము ల్నయినా- యెళిపోమనండి. యిదేనా సెయ్యండి- పీ.వోగారూ..." అని చెప్పేడు ఆదెయ్య.

"... రెవిన్యూ రికార్డులు తేల్చాల్సిన విషయం గదా - ఆదెయ్యా. రికార్డులయినా తేల్చాలీ; మీరూ మీరూ అయినా చర్చించుకొని రాజీ పడాల. ఎందుకు చెప్పు గొడవలూ, ఘర్షణలూ, కేసులూ, జైళ్లూ...! ఎంత అశాంతి!

మీరింకా కొన్ని డిమాండ్లడిగేరు- సంతల్లో నిత్యావసర సరుకులనీ, మెడికల్ సదుపాయలనీ, నూతులనీ, యేవో స్కీములనీ.. వో.కే. యిలాంటివి నా చేతిలో పని. చేసేస్తాను. శాంతిగా వుండండి... గొడవలు పడొద్దు.." అని, శాంతంగా చెప్పేరు. పీవోగారు.

"...మంచిది, పీ.వోగారు అలాగే, అలగలగే. వొస్తామ్మరి..." అని లేచేడు ఆదెయ్య.

"అదేంటీ; అయిపోయిందా మీ డెలిగేషన్..." అనడిగేరు పీ.వోగారు.

"... అయిపోయిందిగదా! మీరు చెప్పేరు గదా- మీ చేతిలోవి అన్నీ చేసెస్తాననీ, శాంతిగా వుండండనీ, గొడవలు పడకండీ అని! మరింకే౦వి?

ఈ ముక్కలే- అక్కడ మా జెనాలకి సెప్తాను. వోర్రే మనోళ్లో- యిక శాంతించర్రా- పీ.వోగారు చేతిలోవన్నీ యిచ్చేస్తారు. యిక గోల వొద్దర్రా- అని సెప్తాను. కంబరికం కస్టం గుందనీ, పాలెరికం పాచికూడు తిని పిస్తందనీ,గిద్దెడు కూలికి గుండెకాయలు తోడెస్తన్నాయనీ, అప్పు ఫాయిదాల కింద పంట భూ౦వులు పోతన్నాయనీ, వొంటికి గుడ్డముక్కల్లేవనీ, ఆకలికేకలెయ్యకర్రా- శాంతి, శాంతి గుండర్రా అని సెప్తాను.

అడివి స్మాగ్లింగయితే మీకెందుకు, ఆడెవుడో దొంగసారా వొండితే మీకెందుకు, యింకెవుడో యింకేదో పూర్సేసి వొట్టుకుపోతే మీకెందుకు - గొడవలొద్దు, గోసలొద్దు! పీ.వో గోరి చేతుల్ని నమ్మండి. యేలినవోరి చేతుల్ని నమ్మండి... అని సెప్తాను బావూ....' ' అని బదులిచ్చేడు ఆదెయ్య.

పీ.వోగారికి - ఆదెయ్య మాటల సారం, అతని వెటకారం అర్థమయింది. హమ్మో - వీడు అర్భకుడు కాడనుకున్నారు.

అదిగదా- మా ఆదెయ్య మాటల సెె౨వత్కారం! అసలు భోగట్టాసెప్తాడేటి- యెవుడికైనా? ఉప్పలూరి రాజుగారి బస్సు ఆపమన్నాడేగాని- ఆ బస్సు రొండో ట్రిప్పుకి- వోయిదాకెళ్లాల్రా అనన్నాడేటి? అది మనం అర్థం చేసుకోవాలి. అదేగదా- ఆదెయ్య గోడి కయిత్వం., ఆఫీసర్ల తోటి అవనీ, నీతోని, నాతోనవనీ, కొనీసకి అన్నలతోనయినా- అంతేగదా! మెన్న రేతిరి చంద్రన్న యెళి పోయీ ముందెట్టిన గ్రామకమిటీ మీటింగుల - యెలగ మాటాడినాడు? ధర్నాకెల్లి దరువులు కాసీడం, అడ్డడు కూలి రేటడిగేసి - సోలడు పెంచితే సాలు అనుకోవడం, వొంటసారా బెల్లం దొరికితే ఎక్సయిజ్ బాబులకి, అడివి కలప దొరికితే ఫారెస్టు బాబులుకీ- లెక్కమీద అప్ప జెప్పడం- యిదే గదా యిప్లవం! ఈటికి తోడు- మెడికల్ కేంపులెట్టడం, రాత్రి బడులు పెట్టడం, పాటలు పాడడం, యిలాంటివి మరికొన్ని సెయ్యాలగదా? సేద్దుములే అన్నా! సేద్దుంలే - అనన్లేదా? దెబ్బతోటి - చంద్రన్న మళ్లా ఉద్యమమూ, ఎత్తుగడలూ, దీర్ఘకాలికమూ, తాత్కాలికమూ- గత పోరాటం నించి నేర్చుకోవాల్సిన పాఠాలూ - చెప్పవలసొచ్చింది గదా. బోధపరచవలసొచ్చింది గదా. శతృవు యెవుడూ, ఆడి బలమూ, బలగమేటి- మన బలమూ బలగమేటి- యెలాగ నడవాలో- మళ్లా ముక్కడూ ముక్క బోధపరచ వలసొచ్చింది చంద్రన్నకే...!

పీ.వో.గారూ- మీరొక లెక్కా? ఉల్లిపాయ తొక్క- మా వోడి ముందు - అని తలపోసేడు టిప్పా.

“అదిగాదు అదెయ్యా- చట్టం చెయ్యాల్సిందంతా చేస్తుంది. మీరు చట్టవ్యతిరేక గొడవలకి దిగొద్దు. శాంతికి భగ్నం కలిగించొద్దూ అంటున్నా” నన్నారు పీ.వోగారు.

“...ఔను సార్. అలాగే సారన్నాను గదా...” అని కదిలేడు ఆదెయ్య.

“....కాదు ఆదెయ్యా- చట్ట ప్రకారం తేల్చలేనివి కొన్ని- చర్చలు ద్వారా తేల్చుకోవచ్చు. మీరు గాకుంటే - మీ లీడర్స్ - చంద్రన్నా, యింకెవరో వుంటారుగదా- వారొచ్చి చర్చించినా మంచిదే. అవతలివాళ్లకు - నేను చెప్తాను చర్చించుకోమని...” అని చెప్పేరు పీ.వోగారు!

అప్పుడు - టిప్పోకి రుక్మిణమ్మ- చంద్రన్నతో మాటాడాలిరా అనటం గుర్తొచ్చింది. ఇక్కడ- పీ.వో అదే మాట! ఏదో లంకె వుంది ఏటది...? ఏటది? ప్రశ్నల్తో నిల్చున్నాడు టిప్పా. రాయేస్- అని, పిలిచేడు ఆదెయ్య. పీ.వో నిట్టూర్చి, పెదవి విరచి చూసేరు. అప్పుడు టిప్పా.

“...బావూ. మీ చట్ట ప్రకారం తేల్చలేనివి- మా చట్ట ప్రకారం తేల్చిన్నాడు తేల్చుతాం! వొదిలీం! వొకనాటికి - మా చట్టం వొస్తాది గాక వొస్తాది - గురుతుంచుకొండి...’ ’ అని నడిచేడు.

★★★

ఆ తర్వాత, మామూలే. ధర్నా శిబిరం మీద పోలీసుల దాడి. సాయంత్రానికి - ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిన జనం.

ధర్నా ముగిసే ముందు, వొక వ్యక్తితో కబురు- చంద్రన్న రాత్రి కొస్తన్నాడట.- అరిజెంటుగేదో చర్చించాలని తొందర్లోనే తిరిగొచ్చేస్తన్నాడట- గెడ్డదగ్గరకు ట్టిపాని రమ్మన్నాడట.

ట్టిపా- రుక్మిణమ్మ యింటికి చేరేడు. పొద్దు గుంకి పోయింది. పాడి పశువుల - పాలుదీయాలి. తపేళా తీసుకువెళ్తుంటే, రుక్మిణమ్మా వొచ్చి-

"....వొరే ట్టిపా.... మీ చంద్రన్నొ స్తాడటరా, యీ పొద్దొ, రేపో...." అని ప్రశ్నించింది.

ట్టిపాకి - మళ్లీ ప్రశ్నల మీద ప్రశ్నలు...! పాడి ఆవు..... పాల శిరాల్ని ...నొక్కిపారేస్తున్నాడు. సుయ్‌సుయ్ మంటూ పాల ధారలు- తపేళా నిండిపోతోంది. పొంగి పొర్లుతున్నాయి. అయినా పిండుతున్నాడు... వాడు పాలని పిండుతుండటం లేదు. ప్రశ్నల్ని పిండుతున్నాడు. జవాబుల కోసం......!

❖